

శైవక్షేత్రాలకు భక్తుల తాకిడి

- కార్తీక మాసం మూడో సోమవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా జిల్లాలోని అన్ని శైవక్షేత్రాలు భక్తుల శివనామ స్మరణలతో మార్మోగాయి. తెల్లవారుజామునే ఆలయాల వద్ద భక్తులు బారులుతీరారు. అర్చకులు ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ప్రముఖ శైవక్షేత్రమైన పంచదార్లకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొండ దిగువున ఆకాశ ధార వద్ద పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం కొండపైన వున్న ఉమాధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు.



రాంబిల్లి మండలం పంచదార్లలో ఉమాధర్మలింగేశ్వరస్వామికి పాలాభిషేకం చేస్తున్న అర్చకులు



ఆకాశ ధార వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

సైబర్ నేరస్థులకు సహకరిస్తే చర్యలు

- ఎస్పీ తుహిన్ సిన్హా



తుహిన్‌సిన్హా, ఎస్పీ

అనకాపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లకు సహకరించే వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తుహిన్ సిన్హా హెచ్చరించారు. ఇటీవల వ్యాపార పెట్టుబడి పేరుతో భారీ మొత్తంలో మోసం జరిగిన ఘటనలో పోలీసులు సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి కీలక వివరాలను రాబట్టారని చెప్పారు. బాధితుడు 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి, ఎన్సీఆర్పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేయడంతో ఆ మొత్తం అనేక బ్యాంకు ఖాతాల ద్వారా సైబర్ నేరగాళ్లకు చేరినట్టు విచారణలో తేలిందని తెలిపారు. తరువాత ఆ డబ్బు క్రిప్టోకరెన్సీగా మారి విదేశీ నేరగాళ్లకు చేరిందన్నారు. తమ బ్యాంకు ఖాతాలను ఇతరుల లావాదేవీల కోసం ఉపయోగించేందుకు ఇవ్వడాన్ని నేరానికి సహకరించినట్టు పరిగణిస్తామని స్పష్టం చేశారు. బ్యాంకు లావాదేవీల్లో అనుమానాస్పదమైన వాటిని గమనించిన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు లేదా సమీపంలోని పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రజల సహకారం అత్యవసరమని, ప్రతిఒక్కరూ సైబర్ భద్రతపై అప్రమత్తతతో వుండాలని ఎస్పీ కోరారు.

పరిశ్రమల హబ్‌గా మాకవరపాలెం

నేడు ఎంఎస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన

- రాచపల్లిలో 310 ఎకరాలు కేటాయింపు
- యూనిట్ల స్థాపనకు మరో రెండు కంపెనీలు ఆసక్తి
- పెట్టుబడుదారుల సదస్సులో ఒప్పందాలు



రాచపల్లిలో ఎంఎస్ఎన్ఈ పార్కుకు కేటాయించిన స్థలం

మాకవరపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): **నర్సీపట్నం నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ఏర్పాటు కేంద్రానికి మంగళవారం మాకవరపాలెం మండలంలో శంకుస్థాపన చేయనున్నారు. ఇదే మండలంలో మరో రెండు ప్రైవేటు కంపెనీలకు భూములు కేటాయించారు.**

రాష్ట్రంలో వివిధ రకాల పరిశ్రమలను విస్తృతంగా ఏర్పాటు చేయడం ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేస్తున్నది.



ఫుడ్ ప్రాసెసింగ్, డోస్క్ ఇండియా కంపెనీలకు కేటాయించిన భూమి

నర్సీపట్నం నియోజకవర్గానికి సంబంధించి మాకవరపాలెం మండలంలో ప్రభుత్వ భూములు అందుబాటులో వుండడంతోపాటు రవాణా పరంగా అనువుగా వుండడంతో స్థానిక ఎమ్మెల్యే, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇండస్ట్రియల్ పార్కును (ఎంఎస్ఎంఈ) ఇక్కడ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సిఫారసు చేశారు. దీంతో రెండు నెలల క్రితం ఆమోదం లభించింది. రాచపల్లి రెవెన్యూ పరిధిలో ఏపీఐఐసీకి చెందిన 310 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఈ పార్కుకు

... మిగతా 8వ పేజీలో

విశాఖకు ఐటీ పరిశ్రమల వెల్లువ

రుషికొండ ఐటీ హిల్ నంబర్ 3పై ఐటీ, ఐటీ సేవలకు సంబంధించిన కార్యాలయాలు నిర్మించనున్న రహేజా

27.1 ఎకరాలు కేటాయింపు

- రుషికొండ, కాపులుప్పాడ ప్రాంతాల్లో క్వార్క్ టెక్నో సాఫ్ట్, మదర్‌సన్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్, ఐస్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఫ్లూయెంట్ గ్రిడ్ సంస్థలకు భూములు
- రూ.2,200 కోట్ల పెట్టుబడితో 30 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్న విశాఖ రియాల్టీ లిమిటెడ్ సంస్థ
- అనకాపల్లి జిల్లాలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సంస్థకు 160 ఎకరాలు



- డోస్క్ ఇండియా సంస్థకు 150 ఎకరాలు
- విశాఖలో జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ బెంచ్ ఏర్పాటుకు ఓకే
- రియల్‌టైమ్ గవర్నెన్స్, డిజిటల్ పాలనపై సింగపూర్‌తో ఎంఓయూ
- విశ్వనాథ స్పోర్ట్స్‌కు భవానీ ద్వీపంలో భూమి
- రాష్ట్ర మంత్రివర్గంలో కీలక నిర్ణయాలు

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): **రాష్ట్ర మంత్రివర్గం విశాఖపట్నానికి సంబంధించి సోమవారం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అనేక ఐటీ సంస్థలకు జిల్లాలో భూముల కేటాయింపునకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వీటి ద్వారా పెద్దఎత్తున పెట్టుబడులే కాకుండా ఉద్యోగ అవకాశాలు కూడా వస్తాయని ప్రకటించింది. ఆ వివరాలు...**

- విశాఖ రియాల్టీ లిమిటెడ్ సంస్థ రూ.2,200 కోట్ల పెట్టుబడితో 30 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనుంది. ఈ సంస్థ ఐటీ, గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల పాలసీ కింద సుమారు 30 లక్షల చ.అ. విస్తీర్ణంలో గ్రేడ్-1 ఐటీ పార్క్‌ను అభివృద్ధి చేస్తుంది. మూడు దశల్లో పనులు జరుగుతాయి. ఎక్కడ భూమి కేటాయించారనే విషయం ప్రస్తావించలేదు. కాకపోతే ఆ ప్రాంతంలో ఉన్న 80 అడుగుల రహదారిని 100 అడుగులకు

... మిగతా 8వ పేజీలో

అచ్యుతాపురం సీఐ గణేశ్ బదిలీ

వీఆర్‌కు పంపుతూ డీఐజీ ఉత్తర్వులు

అచ్యుతాపురం రూరల్, నవంబరు 10, (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం పోలీస్‌స్టేషన్ సీఐ నమ్మి గణేశ్ బదిలీ అయ్యారు. ఆయనను విశాఖపట్నం రేంజ్‌కు అటాచ్ చేస్తూ డీఐజీ గోపీనాథ్ జట్టి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో అనకాపల్లి జిల్లా మహిళా పోలీసు స్టేషన్ సీఐ ఆర్‌వీఎస్ఎస్ చంద్రశేఖరరావును నియమించారు. కాగా గణేశ్ ఆకస్మిక బదిలీపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అచ్యుతాపురం మండలం భోగాపురంలో రెండు వర్గాల మధ్య సాగు తున్న భూ వివాదంలో ఒక వర్గం ఒత్తిళ్లకు ఆయన లొంగకపోవడంతో బదిలీ చేయించినట్టు చెబుతున్నారు.

రాష్ట్ర కాపు కార్పొరేషన్ బోర్డులో జిల్లా నుంచి నలుగురికి చోటు

అనకాపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాపు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ బోర్డులో జిల్లాకు చెందిన నలుగురికి చోటు లభించింది. అచ్యుతాపురం మండలం చీమలాపల్లికి చెందిన టీడీపీ నాయకుడు మామిడి శివఅప్పారావు, పాయకరావుపేట మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నేత పెదిరెడ్డి చిట్టిబాబు అనకాపల్లి మండలం కూండ్రం గ్రామానికి చెందిన తెలుగు మహిళ నాయకురాలు శానాపతి స్వరూప, రావికమతం మండలం టి.అర్జాపురానికి చెందిన సీనియర్ నేత రాజాన కొండనాయుడులను డైరెక్టర్లుగా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

యూరియా కోసం తోపులాట

వరి పంటకు చివరి విడత ఎరువు వేయడానికి సమయం ఆసన్నం

- ఆర్ఎస్‌కేలకు భారీగా తరలివచ్చిన రైతులు
- యూరియా అందదేమోనని ఆతృత
- ఒక్కో రైతుకు బస్తా మాత్రమే పంపిణీ



మునగపాక ఆర్ఎస్‌కే వద్ద తోసుకుంటున్న రైతులు

ఎలమంచిలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పొట్ట దశకు వచ్చిన వరి పంటకు చివరి విడత యూరియా వేయాల్సి రావడంతో రైతులు రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కే), పీఏసీఎస్‌ల వద్దకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మండలంలో ఎలమంచిలి, షేకిళ్లపాలెం, కట్టుపాలెం, సోమలింగపాలెం, పోతిరెడ్డిపాలెం, పులపర్తి గ్రామాల్లోని రైతు సేవా



ఎలమంచిలి వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద యూరియా కోసం ఎగబడుతున్న రైతులు

కేంద్రాల్లో ఎరువుల పంపిణీ జరుగుతున్నట్టు తెలుసుకున్న రైతులు ఉదయాన్నే ఆయా కేంద్రాల వద్ద బారులు తీరారు. ఎలమంచిలి వ్యవసాయ శాఖ కార్యాలయం వద్దకు పెద్ద సంఖ్యలో రైతులు తరలిరావడంతో తోపులాట చోటుచేసుకుంది. క్యూ పద్ధతి పాటించకపోవడంతో ఒకరినొకరు తోసుకునే పరిస్థితి ఎదురైంది. పేర్లు నమోదు చేసుకునేచోట కూడా రైతులు ఎగబడ్డారు. ఎలమంచిలి, పులపర్తి కేంద్రాలకు అధిక సంఖ్యలో రైతులు తరలివచ్చారు. అయితే రైతుకు ఉన్న పొలం విస్తీర్ణం ఎంత వున్నప్పటికీ ఒక్కో రైతుకు ఒక బస్తా మాత్రమే యూరియా ఇస్తుండడంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వరి పైరు పొట్ట దశకు చేరిందని, ఈసమయంలో సరిపడ యూరియా వేయకపోతే పంట దిగుబడి తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు ఒక బస్తా చొప్పున యూరియా అందజేయాలని కోరుతున్నారు.

మునగపాకలో...

మునగపాక, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం సోమవారం రైతు సేవా కేంద్రానికి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఖరీఫ్‌లో చివరి విడత యూరియా పంపిణీపై అధికారులు ముందుగానేన సమాచారం ఇవ్వడంతో

... మిగతా 8వ పేజీలో

అడుగడుగునా గోతులే!

- దుర్భరంగా పీఎస్‌పేట-జన్నవరం రహదారి
- అసలే అంతంత మాత్రం.. తుఫాన్ ధాటికి పూర్తిగా ఛిద్రం
- పలు గ్రామాల ప్రజల ఇక్కట్లు



జన్నవరం వద్ద రహదారిపై ఏర్పడిన భారీ గోతులు

చోడవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం మండలాలను కలిపే పీఎస్‌పేట- జన్నవరం రోడ్డు దారుణంగా తయారైంది. అసలే అంతంత మాత్రంగా ఉన్న ఈ రహదారి ఇటీవల వచ్చిన మొంథా తుపానుకు మరింత దెబ్బతిన్నది. రహదారిపై పలుచోట్ల పెద్ద పెద్ద గోతుల ఏర్పడి ప్రమాదభరితంగా వుంది. ఈ రహదారి అభివృద్ధి మూడు అడుగులు ముందుకు, ఆరు అడుగులు వెనక్కి అన్న చందంగా తయారైంది. చోడవరం నుంచి పీఎస్‌పేట మీదుగా జన్నవరం, చాకిపల్లి, కన్నంపాలెం, తిమ్మనపాలెం, బెన్నవోలుతోపాటు బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల్లోని పలు గ్రామాలకు ఈ రహదారి ఎంతో ముఖ్యమైనది. అయితే చాల ఏళ్ల నుంచి నిర్వహణ కొరవడడంతో అధ్వానంగా తయారైంది. వైసీపీ హయాంలో రూ.2.83 కోట్లు మంజూరయ్యారు. టెండర్లు కూడా ఖరారు చేసి పనులు కూడా మొదలుపెట్టారు. కన్నంపాలెం నుంచి



పీఎస్‌పేట చెరకు కాటా వద్ద గోతులమయంగా తయారైన రహదారి

... మిగతా 8వ పేజీలో

హెచ్‌పీసీఎల్ పైపులైన్‌కు లీకేజీలు

- వెంటనే అప్రమత్తమై ఇంధన ఉత్పత్తుల సరఫరా నిలుపుదల
- రక్షణ ఏర్పాట్ల మధ్య మరమ్మతు పనులు
- నేటి ఉదయానికి పూర్తవుతాయని అధికారులు వెల్లడి



పాములవాక వద్ద ఇంధన సరఫరా పైపులైన్లకు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

కోటవురట్ల, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాములవాక శివారు పంట పొలాల వద్ద హెచ్‌పీసీఎల్ కంపెనీకి చెందిన ఇంధన సరఫరా పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడ్డాయి. ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టారు. విశాఖపట్నం హెచ్‌పీసీఎల్ నుంచి విజయవాడ సమీపంలోని కొండపల్లికి పెట్రోలు, డీజిల్, నేచురల్ గ్యాస్ వంటివి సరఫరా చేయడానికి ఏర్పాటు చేసిన పైపులైన్ కోటవురట్ల మండలం మీదుగా వెళుతున్నది. దీనిని నిర్వహణ బాధ్యతలను గెయిల్ చేపట్టింది. పాములవాక శివారులో పైపులైను లీకేజీలను గెయిల్ సిబ్బంది సోమవారం ఉదయం గుర్తించారు. సమాచారం తెలుసుకున్న హెచ్‌పీసీఎల్ అధికారులు అప్రమత్తమై ఇంధన ఉత్పత్తుల సరఫరాను నిలుపుదల చేశారు. అనంతరం ఇక్కడకు వచ్చి పైపులైన్ లీకేజీలను పరిశీలించారు. పైపులైన్‌ను బాగు చేయడానికి గొయ్యి తవ్వకం పనులు చేపట్టారు. ముందు జాగ్రత్త చర్యగా రెండు అగ్నిమాపక వాహనాలను రప్పించారు. పైపులైన్‌కు లీకేజీలను గుర్తించి ఆధునిక యంత్రాలతో అరికట్టే పనులు ప్రారంభించారు. మంగళవారం ఉదయానికి పనులు పూర్తవుతాయని హెచ్‌పీసీఎల్ అధికారులు తెలిపారు.

ఢిల్లీలో పేలుడు.. జిల్లా పోలీసులు అప్రమత్తం

- రైల్వేస్టేషన్‌లో ముమ్మరంగా తనిఖీలు



రైలులో తనిఖీలు చేస్తున్న సీఐ, ఎస్ఐలు

అనకాపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం రాత్రి సంభవించిన భారీ పేలుడుతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాత్రి తొమ్మిది నుంచి అనకాపల్లికి వచ్చే రైళ్లల్లో సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ నవీన్, సిబ్బంది విస్తృతంగా సోదాలు చేస్తున్నారు. ప్రతి బోగీలో ప్రయాణికులకు చెందిన లగేజీని క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. అనకాపల్లి రైల్వేస్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళుతున్న ప్రయాణికులను ప్రశ్నించడంతోపాటు ప్లాట్‌ఫారంపై ఉన్న వారి వస్తువులను కూడా తనిఖీలు చేశారు.



ప్లాట్‌ఫారంపై ప్రయాణికులను ప్రశ్నిస్తున్న ఆర్‌పీఎఫ్ అధికారులు

ఆర్కిటెక్ విద్యార్థులు ఇటుకల పరిశ్రమ సందర్శన



ఇటుకల పరిశ్రమను సందర్శించిన ఏయూ విద్యార్థులు

మునగపాక, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచక్ర పాల్కీ బ్రిక్ ఇండస్ట్రీని విశాఖ ఆంధ్ర యూనివర్సిటీ ఆర్కిటెక్ విద్యార్థులు సోమవారం సందర్శించారు. ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పాల్కీ ఇటుకలు తయారీ విధానంపై తెలుసుకోవడానికి వచ్చినట్టుఅధ్యాపకులు బి.రమేశ్‌బాబు తెలిపారు. ఇటుకల తయారీ విధానాన్ని యాజమాని ఆడారి అప్పలనాయుడు, ఆడారి డిపేశ్ ఈ సందర్భంగా వారికి వివరించారు.

'రోలుగుంట సూరి' ఫస్ట్ లుక్ విడుదల



రోలుగుంట సూరి సినిమా పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

అచ్యుతాపురం రూరల్, నవంబరు 10, (ఆంధ్రజ్యోతి): గ్రామీణ వాతావరణం బ్యాక్‌డ్రాప్‌లోరూపొందిన రోలుగుంట సూరి అనే సినిమా ఫస్ట్‌లుక్, పోస్టర్లను సోమవారం స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ విడుదల చేశారు. రియలిస్టిక్ ఎమోషనల్ డ్రామాగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని తపస్వీ ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై సౌమ్య చాందిని పల్లా నిర్మించారు. అనిల్ కుమార్ పల్లా దర్శకత్వంలో నాగార్జున నూతన హీరోగా, ఆద్యారెడ్డి, భావన నీలిపి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్ హృదయాన్ని హత్తుకునేలా ఉందని చిత్ర యూనిట్‌ను ఎమ్మెల్యే అభినందించారు.

ఘనంగా అంబలం పూజ



అంబలం పూజలో ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక గౌరమ్మ గుడి ప్రాంగణంలో సోమవారం అయ్యప్ప అంబలం పూజ ఘనంగా జరిగింది. వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని తలపించేలా సెట్టింగ్ అబ్బురపరుస్తోంది. అయ్యప్పస్వామికి ఎమ్మెల్యే విజయకుమార్ పూజలు నిర్వహించారు. ఆయనకు ఆడారి గంగ మహేశ్, ఆడారి గణేష్, వెలవలపల్లి కోటేశ్వరశర్మ సత్కరించారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు



సారెతో వెళ్తున్న భక్తులు

అచ్యుతాపురం రూరల్, నవంబరు 10, (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపాలెంలో సోమవారం ఘనంగా గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు జరిగింది. ఈ 12న జాతర జరగనుంది. ఇందులో భాగంగా శరగడం సూర్యనారాయణ, వరలక్ష్మి దంపతుల ఇంటి వద్ద నుంచి పసుపు కుంకుమలతో జాతరను ప్రారంభించారు. వివిధ రకాల పిండివంటలతో మహిళా భక్తులు గౌరీ పరమేశ్వరుల ఆలయం వరకు చేరుకుని నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మారిశెట్టి ప్రసాద్, కాండ్రేగుల రామ్‌ప్రసాద్, మళ్ల ప్రకాష్, కాండ్రేగుల వీరునాయుడు, పొలమరశెట్టి రమణ, అప్పారావు, కాండ్రేగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు దిమిలిలో దల్లమాంబ జాతర

▸ వెదుళ్ల ఉత్సవానికి ఏర్పాట్లు

రాంబిల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రసిద్ధి చెందిన దిమిలిలో దల్లమాంబ జాతర ఈ నెల 11న మంగళవారం వైభవంగా జరుగనుంది. ఈ జాతరలో వెదుళ్ల ఉత్సవం ప్రత్యేకత ను చాటనుంది. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, భక్తుల కొంగుబంగారంగా పేరొందిన ఈ అమ్మవారి జాతర ఏర్పాటుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



దల్లమాంబ



ఉత్సవానికి సిద్ధం చేసిన వెదురు కర్రలు

ఆలయ చారిత్రక నేపథ్యం..

ఈ జాతరకు చారిత్రక నేపథ్యం ఇదీ.పూర్వం ఈ ప్రాంత యువతులపై మరాఠీ యువకులు అత్యాచారాలకు పాల్పడేవారు. ఈ స్థితిలో బ్రాహ్మణ కుటుంబానికి చెందిన దల్లమాంబ ఓ రోజు శారదా నది ఒడ్డున స్నేహితురాళ్లతో ఆడుకుంటుండగా గుర్రాలపై మరాఠీ దుండగులు రావడం గమనించి వారి చేతికి చిక్కడం ఇష్టంలేని ఆమె నదిలో దూకి ప్రాణత్యాగం చేసింది. దీంతో గ్రామంలో యువకులకు చైతన్యం వచ్చి మరాఠి యువకుల ఆగడాలపై ఎదురుదాడికి దిగారు. అప్పటి నుంచి మరాఠి యువకుల దాడులు ఆగిపోయాయని చరిత్ర చెపుతుంది. కొన్నాళ్లకు అమ్మవారు స్థానిక రైతుకు స్వప్నంలో కనిపించి ఆమె కోరికపై గుడి కట్టారు. మరాఠి యువకులను వెదుళ్లతో అడ్డుకోవడానికి నిదరన్శనంగా రెండేళ్లకోసారి జాతరలో వెదుళ్ల ఉత్సవం నిర్వహిస్తూ వస్తున్నారు.వెదుళ్ల ఉత్సవంలో వినియోగించిన వెదుళ్లను ఇంటి వద్ద ఉంచితే శుభం కలుగుతుందని భక్తుల నమ్మకం. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకునియోజకవర్గం నలుమూలలనుంచి వేలాదిమంది భక్తులు తరలిరానున్నారు.

ఏర్పాట్లు పూర్తి...

ఈ జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మధ్యాహ్న 3 గంటల సమయంలో వెదుళ్ళ సంబరం నిర్వహించనున్నారు. సాయంత్రం శారదా నది ఒడ్డున భారీగా బాణసంచా కాల్చనున్నారు. పలు సాంస్కృతి కార్యక్రమాలుఏర్పాటు చేశారు. జాతరలో అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ నరసింగరావు పర్యవేక్షణలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



పంచదార్లలో ఉమాధర్మలింగేశ్వరస్వామికి పాలాభిషేకం చేస్తున్న అర్చకులు



శూలం ధరించి మొక్కు చెల్లించిన మహిళా భక్తులు

కార్తీక శోభ

రాంబిల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడో సోమవారం ప్రసిద్ధ పంచదార్లలోని శివాలయాలను భక్తులు అధిక సంఖ్యలో దర్శించారు. ముందుగా శ్రీ రాధామాధవస్వామి ఆలయం గర్భంలో ప్రవహిస్తున్న ఐదు ధారలలో ఒకటైన ఆకాశ గంగగా పిలిచే ప్రధాన దార వద్ద భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు. స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు ఫణిగిరిపై వెలసిన శ్రీ ఉమాధర్మలింగేశ్వర స్వామి వారిని దర్శించారు. అర్చకులు ఉమాధర్మలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. సహస్రలింగేశ్వరస్వామిని, రాధామాధవస్వామిని, ద్విముఖ వినాయకుడిని, సాయిబాబావారిని భక్తులు దర్శించి పూజలు చేశారు. రాంబిల్లి పోలీసులు, ఆలయ కమిటీలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. లాలంకోడూరు, దిమిలి, కట్టుబోలు, కొత్తపట్నం, గోకివాడ, కొత్తూరు శివాలయాలనూ భక్తులు అధిక సంఖ్యలో దర్శించారు. పంచదార్ల పుణ్యక్షేత్రంలో దాసరి లోవరాజు ఆర్థిక సహకారంతో భక్తులకు ఉచిత ప్రసాద వితరణ కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫణిగిరి ధర్మ పరిరక్షణ సేవా ఫౌండేషన్ చైర్మన్ ఉరిటి నానాజీ, పెద్దలు సత్తిబాబు, నాని, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శూలాల సంబరం

మునగపాక: మండల పరిధి నాగులాపల్లిలో శ్రీపార్వతి, సాంబమూర్తిల శూలాలు సంబరం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి శూలధారణతో భక్తులు మొక్కులు చెల్లించారు. వాటితో పాటు 1001, 516, 116 ఇనుప చువ్వలు కలిగిన సుబ్రహ్మణ్యం, శివ శూలాలను వీర శైవులు ధరించారు. ఈ సందర్భంగా గ్రామంలో సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

విభూది శివలింగాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే

నాగులాపల్లి శ్రీపార్వతి, సాంబమూర్తి ఆలయంలోని బూడిద శివలింగాన్ని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దర్శించుకున్నారు. తొలుత ఎమ్మెల్యే విజయకుమార్‌కు సాదరస్వాగతం పలికారు. శాలువా కప్పి జ్ఞాపికను అందజేశాకె, ఆయన వెంట కూటమి నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, యల్లపు వెంకటభాస్కరరావు, దాడి ముసిలినాయుడు, టెక్కలి పరశురాం, రాజునాయుడు, ఆడారి గణేష్ తదితరులు ఉన్నారు.

అచ్యుతాపురం రూరల్: మండలంలోని పెదపాడులో భోగలింగేశ్వరస్వామి ఆలయాన్ని స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు ఆచరించారు. రామన్నపాలెంలో గౌరీపరమేశ్వరుల పండుగలో పాల్గొన్నారు. కొండకర్ల-అందలాపల్లిలో ఉమా జగదీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. టీడీపీ ప్రధాన కార్యదర్శి బొద్దపు సుధాకర్ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జరపరెడ్డి శ్రీనివాసరావు, జనపరెడ్డి నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

ఎలమంచిలి: భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. తెల్లవారు నుంచే ఎలమంచిలి కొత్తపేటలోని పురాతన రామలింగేశ్వర స్వామి ఆలయం, సీతారాముల ఆలయం, త్రిమూర్తులు స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. సోమలింగపాలెం, పెదపల్లి, తెరువుపల్లి, కొక్కిరాపల్లి, యర్రవరం వార్డులతో పాటు, ఏటికొప్పాక, పులపర్తి, పీఎన్ఆర్‌పేట, పురుషోత్తపురం, పోతిరెడ్డిపాలెం తదితర గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి.

ఆకట్టుకున్న కోలాటం

రాంబిల్లి: వాడనర్సాపురం లో అభయాంజనేయస్వామి తీర్థ మహోత్సవాలు సందర్భంగా రూరల్ యూత్ డెవలప్ మెంట్ సొసైటీ కార్యదర్శి సూరాడ నూకరాజు ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన మహిళల కోలాటం ఆకట్టుకుంది. 30 మంది మహిళలు భక్తిగీతాలకు కోలాటం ప్రదర్శించారు.



వాడనర్సాపురంలో కోలాట ప్రదర్శన

కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా శివ అప్పారావు



డైరెక్టర్‌గా నియమితులైన శివ అప్పారావు

అచ్యుతాపురం రూరల్, నవంబరు 10, (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలాపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మామిడి శివ అప్పారావుకు కాపు వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. చీమలాపల్లి సర్పంచ్‌గా, క్లస్టర్ ఇన్‌చార్జిగా, టీడీపీ కార్యకర్తగా పలు సేవలు అందించిన శివ అప్పారావుకు ఈడైరెక్టర్ పదవి లభించడం పట్ల రాష్ట్ర రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పీలా తులసీరాం పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

శివపార్వతుల కల్యాణానికి శతమానం బహూకరణ



ఉత్సవ కమిటీ సభ్యులకు బంగారం అందిస్తున్న భక్తులు

మునగపాక, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాటిపల్లి లో రామలింగేశ్వర స్వామి (లింగరాయి) ఆలయంలో ఈ నెల 17న శివపార్వతుల కల్యాణం జరగనుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు సోమవారం కరపత్రాలను ఆవిష్కరించారు. కల్యాణోత్సవానికి సూరిశెట్టి వెంకటసూరిఅప్పారావు, దేవకి, త్రినాధసంతోశ్ కుమార్,చక్రి శతమానం కోసం పావుతులం బంగారం బహూకరించారు.

తమ్మయ్యపేటలో వినతులు స్వీకరణ

అచ్యుతాపురం రూరల్, నవంబరు 10, (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొప్పెర్ల శివారు తమ్మయ్యపేటలో సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. నునపర్తి ఎంపీటీసీ సభ్యుడు పల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు గ్రీవెన్సులో ఈ వినతులు అప్‌లోడ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముచ్చు గంగరాజు, కొల్లి వరహాలు, కొల్లి వెంకటలక్ష్మి, కొల్లి చిట్టిబాబు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



కూలిన బాత్రూమ్ వద్ద ఇంటి యజమాని పెదదేముడు

అచ్యుతాపురం రూరల్, నవంబరు 10, (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన శీరం పెదదేముడుకు చెందిన బాత్రూమ్ సోమవారం ఉదయం ఒక్కసారిగా కూలిపోయింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోడలు నాని కూలిపోయింది. బాత్రూం కూలిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా పెదిరెడ్డి చిట్టిబాబు




పెదిరెడ్డి చిట్టిబాబు

పాయకరావుపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు నియమితులయ్యారు. చిట్టిబాబు 2006-2011 వరకు పాయకరావుపేట సర్పంచ్‌గా పనిచేశారు. తరువాత నుంచి టీడీపీ మండల అధ్యక్షుడిగా 13 సంవత్సరాల పాటు పదవిలో ఉన్నారు. ప్రస్తుతం టీడీపీ తుని నియోజకవర్గ పరిశీలకుడిగా సేవలు అందిస్తున్నారు. పార్టీకి చేసిన సేవలను గుర్తించిన అధిష్ఠానం తాజాగా ఆయన్ను రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాపుల అభివృద్ధి, సంక్షేమంతో పాటు పార్టీ మరింత బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబునాయుడు, మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్

పాయకరావుపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని తహశీల్దార్ ఎస్ఏ.మహేశ్వరరావు తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో సోమవారం అన్ని ప్రభుత్వ శాఖల అధికారుల ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో ప్రతీ సోమవారం గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. దరఖాస్తులను తమ పరిధిలో ఉన్నంత వరకు వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంఈవో-2 రమేష్‌బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో హోమం



ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు

ఎస్.రాయవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చక్రవర్తి ఆధ్వర్యంలో ఉదయం పలువురు పండితుల వేద మంత్రోచ్ఛరణ నడుమ యాగశాల అర్చన హోమంతో పాటు ఐశ్వర్యలక్ష్మి హోమం చేశారు. అలాగే మహిళా భక్తులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బొలిశెట్టి గోవిందరావు, శారదకుమారి దంపతులు, గ్రామ నాకులు కొణతాల శ్రీనివాసరావు, సోమిరెడ్డి రాజు, పులి సత్తిబాబు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

పాయకరావుపేట రూరల్/నక్కపల్లి/కోటవురట్ల/ ఎస్.రాయవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడో సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శివ నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పాయకరావుపేట, తుని, నక్కపల్లి, తదితర మండలాల్లోని గ్రామాల నుంచి వేలాది భక్తులు గోపాలపట్నం సీతమ్మవారి కొండకుతరలి వచ్చి ఉమాధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. భక్తులకు మంగవరం గ్రామ ప్రజల ఆధ్వర్యంలో అన్న సమారాధన చేశారు. అలాగే నక్కపల్లి మండలంలోని ఉపమాక, గొడిచెర్ల శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఉపమాక శివాలయంలో తెల్లవారుజామున 3 గంటలకు త్రినేత్రుడికి తొలి అభిషేకం చేసి, సప్త హారతులిచ్చారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో అర్చకులు మహేశ్, సంతోశ్ పూజలు చేశారు. ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. శివాలయాల వద్ద వేలాదిమందికి అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. కోటవురట్ల మండలంలోని రాజుపేట రాజలింగేశ్వరస్వామి ఆలయంలో వందిలాది మంది భక్తులు పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపారాధన చేశారు. స్వామిని దర్శించుకున్న భక్తులకు ప్రసాదాలు అందించారు.



నక్కపల్లి: ఉపమాక శివాలయంలో భక్తుల రద్దీ



సీతమ్మవారి కొండపై ఉమాధర్మలింగేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన భక్తులు

ఎస్.రాయవరం మండలంలోని శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తుల తాకిడి నెలకొనడంతో ఆలయాలు కిటకిటలాడాయి. పెదఉప్పలంలోని రాజరాజేశ్వరిదేవి సమేత బ్రహ్మలింగేశ్వస్వామి ఆలయంలో వైభవంగా పూజలు నిర్వహించారు. భక్తులకు టిఫిన్‌తో పాటు ప్రతీ సోమవారం అన్నసంతర్పణ జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



కోటవురట్ల మండలంలోని రాజుపేట ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆలయాల అభివృద్ధికి దాతలను గుర్తించాలి

నక్కపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధిలో భాగస్వాములయ్యే దాతలను గుర్తించాలని నక్కపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి చెప్పారు. పెదబోదిగల్లం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు బి.లక్ష్మణరావు దంపతులు సోమవారం ఉపమాక శివాలయానికి రూ.50 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారిని బుజ్జి సత్కరించారు. ఆధ్యాత్మిక రంగంలో సేవ చేసే వారికి ఎనలేని సంతృప్తి వుంటుందని ఆయన చెప్పారు. ఉపమాక శివాలయం అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికలను రూపొందిస్తామని తెలిపారు.



దాతలను సత్కరిస్తున్న సొసైటీ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి

అర్చకుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఎస్. రాయవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉమా సహిత బాలత్రిపురసుందరి సమేత బుర్రేశ్వరస్వామి ఆలయ అర్చకుడు బుర్రేశ్వరశర్మ కుటుంబానికి సోమవారం ఆర్థిక సాయం అందించారు. 40 ఏళ్లుగా అర్చకుడిగా భక్తులకు విశేష సేవలందిస్తున్న బుర్రేశ్వరశర్మ గత నెల 29న అనారోగ్య కారణంగా మృతి చెందారు. దీంతో వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావుతో పలువురు రూ.3.54 లక్షల నగదును సమకూర్చి ఆయన కుటుంబానికి అందజేశారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ర్యాలీ రేపు

పాయకరావుపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై బుధవారం నిరసన ర్యాలీ చేస్తామని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు తెలిపారు. ఈ మేరకు సోమవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావుతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు గెడ్డమూరి శ్రీనివాసరావు, నాయకులు డి.బాబూరావు, డి.సాయిబాబా, డి.బాబి, ఇనరపు తాతారావు, జగతా శ్రీను పాల్గొన్నారు.

నేడు భారీ పడిపూజ

నక్కపల్లి,నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లికి సమీపంలో సారిపల్లివానిపాలెం హైవే పక్కన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత నివాసం వద్ద మంగళవారం రాత్రి అయ్యప్పస్వామి భారీ పడిపూజ జరుగుతుందని హోం మంత్రి క్యాంప్ కార్యాలయం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంతో పాటు మిగిలిన ప్రాంతాల నుంచి దాదాపు 15 వేల మంది అయ్యప్ప, శివ, భవానీ దీక్షాపరులు హాజరవుతారని చెప్పారు. ఇందుకు సంబంధించి విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ పూజలో హోం మంత్రి అనిత కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొంటారు.

గ్రంథాలయ వారోత్సవాలకు ఏర్పాట్లు

నక్కపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని గ్రంథాలయాధికారి కె.జనార్దన్ చెప్పారు. సోమవారం చినదొడ్డిగల్లు హైస్కూల్ హెచ్‌ఎం వి.బాలాజీని కలిసి గ్రంథాలయ వారోత్సవ కార్యక్రమాలను వివరించారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థుల కోసం నిర్వహించే పోటీల గురించి పిల్లలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాములవాకలో నూకాలమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

కోటవురట్ల, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాములవాక గ్రామంలో నూకాలమ్మతల్లి ఆలయ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఆలయం శిథిలావస్థకు చేరి ప్రమాదాలు నిలయంగా మారింది. ఈ నేపథ్యంలో కొత్త ఆలయం నిర్మాణానికి గ్రామస్థులు ముందుకు వచ్చినట్టు కోటవురట్ల పీఏసీఎస్ అధ్యక్షుడు వేచలపు జనార్దన్ తెలిపారు. అన్ని సౌకర్యాలతో కూడిన ఆలయాన్ని నిర్మించనున్నట్టు ఆయన చెప్పారు.

పోటీలతో విద్యార్థుల్లో సృజనాత్మకత

నక్కపల్లి, న వంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే పలు రకాల పోటీలు నిర్వహించడం వల్ల సృజనాత్మకత పెరుగుతుందని సత్యసాయి సేవా జోన్-1 ఇన్‌చార్జి విశ్వేశ్వరరావు చెప్పారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన 'వృత్తే దైవం' అనే అంశంపై సోమవారం నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతిని యశస్విని సాధించారు. ఆమెతో పాటు మండల స్థాయి విజేతలను ఆయన అభినందించి ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పోటీల వల్ల పిల్లల ఆలోచనలో మార్పులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు కె.నరేశ్, నాగన్నదొర, హెచ్‌ఎం వి.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

‘టెన్త్ పరీక్షా కేంద్రాల్లో పూర్తిస్థాయిలో వసతులు’


తరగతి గదిని పరిశీలిస్తున్న జిల్లా పర్యవేక్షణాధికారి శ్రీధర్‌రెడ్డి

పరవాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని పదో తరగతి పరీక్షల జిల్లా పర్యవేక్షణాధికారి శ్రీధర్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆయన మండలంలోని వాడచీపురుపల్లి హైస్కూల్‌ను సందర్శించారు. పాఠశాలలో కల్పిస్తున్న మౌలిక వసతులపై ఆరా తీశారు. తరగతి గదుల్లో పూర్తిస్థాయిలో బెంచీలు, ఇతర సదుపాయాలు ఉన్నాయో లేవో క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పాఠశాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎన్‌.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో హెవీ డ్రైవింగ్ లైసెన్సుకు శిక్షణ ప్రారంభం



శిక్షణను ప్రారంభించిన డీపీటీవో ప్రవీణ

అనకాపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో హెవీ డ్రైవింగ్ లైసెన్సు 11వ బ్యాచ్ శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. డీపీటీవో వి.ప్రవీణ ప్రారంభించారు. శిక్షణకు హాజరైన వారికి ఇందుకు సంబంధించిన సూచనలతో కూడిన పుస్తకాలను ఆమె అందజేశారు. శిక్షణ పూర్తయిన అనంతరం ఆర్టీవో ద్వారా లైసెన్సు చేయిస్తామని డీపీటీవో ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి డిపో అసిస్టెంట్ మేనేజర్ గౌరీ, డ్రైవింగ్ శిక్షకులు జీవీ రమణ, డ్రైవింగ్ స్కూల్ డీఈవో ఏవీ బాపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లల దత్తతపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మేరీ సువార్త

అనకాపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఇక్కడి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జూనియర్ కళాశాలలో సోమవారం జాతీయ దత్తత అవగాహన మాసోత్సవాలను నిర్వహించారు. జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ కె.మేరీ సువార్త ముఖ్య అతిథిగా మాట్లాడుతూ జిల్లాలో గల ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి, వారిని అధికారిక ప్రక్రియ ద్వారా దత్తత ఇవ్వడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కె.ఎల్.మనోహర్, పి.శ్రీదేవి, మంగ, రూప, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

మొగలిపురం గ్రామంలో స్వచ్ఛ భారత్


మొగలిపురంలో మొక్క నాటుతున్న విద్యార్థులు

సబ్బవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మొగలిపురంలో ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు మూడు రోజులపాటు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. అలాగే, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, చికన్‌గున్యా జ్వరాలు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించడంతో పాటు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తమరాన సన్యాసమ్మ, కూటమి నాయకులు తమరాన బంగారునాయుడు, సత్యనారాయణ, అంగటి నానాజీ, మేడపాటి రాము, కొటాన దేముడు, రాయవరపు శ్రీను, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పెంట్‌హౌస్‌ల తొలగింపు



అనకాపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా భవనంపై నిర్మించిన పెంట్ హౌస్‌లను సోమవారం తొలగించామని టీపీవో వరప్రసాద్ తెలిపారు. గాంధీనగరం, కుంచావారి వీధుల్లో యజమానులు తీసుకున్న అనుమతి కంటే అనధికారికంగా పెంట్‌హౌస్‌లు నిర్మించారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అనుమతులు లేని భవనాలు, అదనపు అంతస్తులను తొలగిస్తామని తెలిపారు.

మహా ప్రాణ దీపం శివం..శివం..

▸▸ కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు కిటకిట ▸▸ వేకువజాము నుంచి విశేష పూజలు ▸▸ పలుచోట్ల అన్నసమారాధనలు


అనకాపల్లిలోని సిద్ధిలింగేశ్వరస్వామి ఆలయంలో అర్చకుని అభిషేకం


సబ్బవరం మండలం దేవీపురం దక్షవటిలో స్వామికి భక్తుల పూజలు


అనకాపల్లి మార్కెట్ వద్ద గల ఆలయంలో...


కాశీవిశ్వేశ్వర ఆలయంలో ధ్వజస్తంభం వద్ద..


పరవాడలోని మల్లికార్జున స్వామికి పూజలు

అనకాపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నాలుగు గంటల నుంచి విశేష పూజలు, అభిషేకాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా అనకాపల్లి పట్టణంలోని భోగలింగేశ్వర, సిద్ధిలింగేశ్వర, కాశీవిశ్వేశ్వర, ఉమా రామలింగేశ్వర, మార్కెట్ వద్ద గల శివాలయం తదితరాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. చాలా మంది కుటుంబాలతో విచ్చేసి పరమశివుడ్ని దర్శించుకున్నారు. ధ్వజస్తంభాల వద్ద మహిళలు దీపారాధన చేశారు. భక్తులకు అసౌకర్యం తలెత్తకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పరవాడ మండలంలో...

పరవాడ : మండలంలోని శైవక్షేత్రాలు కార్తీక సోమవారం సందర్భంగా కోలాహలంగా మారాయి. వేకువజామున కుటుంబాలతో సహా వెళ్లి నీలకంఠుని దర్శనానికి బారులుతీరారు. తాడి గ్రామంలో గల ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్పొరేటర్ మాదంశెట్టి చిన తల్లి, నీలబాబు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పరవాడలోని మల్లికార్జునస్వామి ఆలయంలో ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి శ్రీనివాస్ దంపతులతో పాటు సర్పంచ్ శిరపురపు అప్పల నాయుడు, జనసేన మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్, కూటమి నాయకులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయాల వద్ద అన్నసమారాధన జరిపారు. అలాగే మండలంలోని స్వయంభూవరం, లేమర్తి అగ్రహారం, దేశపాత్రునిపాలెం తదితర గ్రామాల్లో గల శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సబ్బవరం మండలంలో...

సబ్బవరం : మండలంలోని శైవక్షేత్రాలు భక్తుల శివ నామస్మరణతో మార్మోగాయి. కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా ఇరు వాడలోని భీమలింగేశ్వరస్వామి, అసకపల్లిలోని కాశీ విశ్వేశ్వర స్వామి, దేవీపురంలోని దక్షవటి, వంగలిలోని లింగాలతిరుగుడు స్వయంభూ సోమలింగేశ్వర స్వామి, పైడివాడలోని స్వయంభూ సందీశ్వర స్వామి ఆలయాలతో పాటు సబ్బవరం, మలునాయుడుపాలెం, గొర్లివానిపా లెంలలోని ఉమా రామ లింగేశ్వరస్వామి, పెదయాతపాలెం గౌరీపరమేశ్వర సహిత ద్వాదశ జ్యోతిర్లింగాలయం, గణపతిపురంలోని మల్లికార్జునస్వామి ఆలయాలు, మొగలిపురంలోని విఘ్నేశ్వరాలయం శివనామ స్మరణతో మార్మోగాయి. ఈ సందర్భంగా రుద్రాభిషేకాలు, పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. వంగలిలో శివపార్వతుల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయాల వద్ద అన్నసమారాధన జరిపారు.

రెవెన్యూ వసూళ్ల పై ప్రత్యేక దృష్టి

▸▸ వీధి కుక్కల సంఖ్యపై అంచనాలు తయారు చేయాలి

▸▸ వివిధ విభాగాల అధికారుల సమావేశంలో జడ్సీ చక్రవర్తి


సమావేశంలో మాట్లాడుతున్న జడ్సీ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలో రెవెన్యూ వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి అధికారులకు స్పష్టం చేశారు. సోమవారం వివిధ విభాగాధిపతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో రెవెన్యూ వసూళ్లలో అనకాపల్లి జోన్ ప్రథమ స్థానంలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జోన్ పరిధిలో వీధి కుక్కలు ఎన్ని ఉన్నాయో అంచనాలు తయారుచేసి నివేదిక అందించాలని సూచించారు. పట్టణంలో ఎక్కడ పడితే అక్క ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేయడానికి అవకాశం లేదని, అలా ఎవరైనా ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే చాలా చోట్ల ఫ్లెక్సీలు తొలగించడం జరిగిందన్నారు. అలాగే పీజీఆర్ఎస్ అర్జీలను సకాలంలో పరిష్కరించాలన్నారు. వాటర్ ట్యాక్స్ వసూళ్లపై కూడా దృష్టి సారించడంతో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌వో రమణ, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా గౌరీ పరమేశ్వరుల కల్యాణం


కల్యాణం జరుపుతున్న అర్చకులు

అనకాపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం వినాయక గౌరీసేవా సమితి ఆధ్వర్యంలో పీలా వారి గౌరీ పరమేశ్వరుల ఆలయం వద్ద సోమవారం స్వామి, అమ్మవారి కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. బొడ్డేడ సత్యదేవ్, శ్రావణి దంపతులు, బొడ్డేడ నాగ ప్రసాద్, వనిత దంపతులు కూర్చొని వేడుక జరిపించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఫార్మా కాలుష్యంపై త్వరలోనే చర్యలు

▸▸ పరవాడ ప్రాంతంలో ఇదో సమస్యగా మారింది

▸▸ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు

▸▸ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో గండి బాబ్జీ


ప్రజలు నుంచి వినతులు స్వీకరిస్తున్న గండి బాబ్జీ

పరవాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఫార్మాసిటీ కారణంగా పరవాడ పరిసర ప్రాంతాల ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తొందరలోనే ఇక్కడి కాలుష్యంపై చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ స్పష్టం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరవాడ ప్రాంతంలో ఫార్మా పొల్యూషన్ పెద్ద సమస్యగా మారిందన్నారు. దీనివల్ల ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. పరవాడ, తానాం, భరణికం గ్రామస్థులు ఫార్మా కాలుష్యంతో సతమతమవ్వడం ఆందోళన కలిగిస్తుందన్నారు. తొందరలోనే సమస్యకు పరిష్కారం జరుగుతుందని స్పష్టం చేశారు. అనంతరం ఆయన వినతులు స్వీకరించారు. ముఖ్యంగా ఫార్మా పొల్యూషన్, రెవెన్యూ, విద్యుత్ సమస్యలపై ఎక్కువ మంది వినతులు అందజేశారు. వీటిని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందికి బాబ్జీ సూచించారు. మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, నాయకులు గండి వంశీ, గొర్లి కనకారావు, నగిరెడ్డి చిన్న, బొండా తాతారావు, పైలా చినఅక్కునాయుడు, పైలా వరలక్ష్మి, రాయవరపు దేముడు, బొండా సన్నిదేముడు, లాలం ఈశ్వరరావు, జనపాల రాములతో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



లంకెలపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి లంకెలపాలెం మారుతి జంక్షన్‌లో కొలువుదీరిన అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం మంగళవారం ప్రారంభం కానుంది. ఐదు రోజుల పాటు ఈ వేడుక నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేపట్టారు. తొలిరోజు గణపతిపూజ, రక్షా బంధనం, పంచగవ్య ప్రాసన తదితరాలు జరపనున్నారు. పెద్ద సంఖ్యలో కమిటీ ప్రతినిధులు పాల్గొనాల్సిందిగా వారు కోరారు.

జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న లక్ష్మీనారాయణ

అనకాపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కొత్తూరు పంచాయతీలోని ఏఎంఏఎల్ కళాశాల ఇండోర్ స్టేడియంలో సబ్ జూనియర్, సీనియర్, ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలను వర్తక సంఘం కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు), ఎస్‌కే కాలేజీ కరస్పాండెంట్ అండ్ చాంపియన్ షిప్ చైర్మన్ కొణతాల బాలసుబ్రహ్మణ్యం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పెదబాబు మాట్లాడుతూ పోటీలను ఛాలెంజ్‌గా తీసుకోవాలన్నారు. గెలుపోటములు సహజమన్నారు. పోటీల్లో అనకాపల్లి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొనగా విజేతలకు పెదబాబు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు సోమవారం జరిగిన పోటీల్లో 90 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.హర్షవర్ధన్ ప్రసాద్, పల్లం మురళీకృష్ణ, చంద్రశేఖర్, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవి ఆలయంలో విశేష పూజలు


అమ్మవారిని దర్శించుకున్న దాడి, మళ్ల

అనకాపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గవరపాలెం సంతబయలు వద్ద గల అన్నపూర్ణాదేవి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్రతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోలారపు త్రినాథ్, మళ్ల రామబుజ్జి, కోరిబిల్లి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన



అనకాపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక చినరాజుపేట చౌడేశ్వరి సాంబశివ ఆలయం వద్ద కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా కూచిపూడి నృత్య ప్రదర్శన, జానపద నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నాయి. భాగవతుల శిరీషారాణి శిష్య బృందం కూచిపూడి, జానపద నృత్యప్రదర్శనలో మెప్పించారు.

పెట్రో వర్సిటీలో మెస్ బిల్డింగ్ ప్రారంభం


కార్యక్రమానికి హాజరైన కలెక్టర్

సబ్బవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వంగలి రెవెన్యూ పరిధిలో గల ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ)లో సోమవారం మెస్ బ్లాక్‌ను ప్రారంభించారు. కలెక్టర్ విజయకృష్ణన్ హాజరయ్యారు. ఐఐపీఈ డైరెక్టర్ సాలీ వాహన్ స్వాగతం పలికారు. రిజిస్ట్రార్ రాంపాల్ ద్వివేది దంపతులు పూజలు జరిపారు. తహసీల్దార్ చిన్నికృష్ణ, కేపీసీ ప్రాజెక్టు డైరెక్టర్ పునీత్‌కుమార్, జీఎం రంగారావు, సర్పంచ్ దంపతులు శ్రీహేమ, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా స్వరూప


స్వరూప

కొత్తూరు (అనకాపల్లి టౌన్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా శానపతి స్వరూపను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. అనకాపల్లి మండలం కూండ్రం గ్రామానికి చెందిన స్వరూప తెలుగుదేశం పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. తెలుగు మహిళా నాయకురాలిగా వ్యవహరిస్తున్నారు. కొంతకాలం కూండ్రం సర్పంచ్‌గా పనిచేశారు. ఈమె తండ్రి రాము మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం పై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం దిబ్బవీధికి చెందిన వ్యక్తి అదృశ్యంపై సోమవారం ఫిర్యాదు అందినట్టు ఏఎస్ఐ పి.నూకరాజు తెలిపారు. దిబ్బవీధికి చెందిన బాడా నరసింగరావు ఉమ్మలాడ సమీపంలోని వెల్డింగ్ పనులు చేస్తుంటాడు. పనికి వెళ్లకుండా మద్యం సేవించి తిరుగుతుండడంతో భార్య మందలించింది. దీంతో ఇద్దరూ గొడవ పడ్డారు. ఐదో తేదీ సాయంత్రం ఇంట్లోంచి బయటకు వెళ్లిన నరసింగరావు తిరిగి రాకపోవడంతో భార్య ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

సెజ్‌లో పైపులైన్‌కు రంధ్రం

▸▸ రెండేళ్లుగా తాగునీరు వృథా ▸▸ పట్టించుకోని ఏపీఐఐసీ అధికారులు


పైపులైన్‌కు రంధ్రం ఏర్పడటంతో పైకి పోతున్న నీరు



రహదారి వెంబడి పారుతున్న నీరు

పరవాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అచ్యుతాపురం సెజ్‌కు తాగునీటిని సరఫరా చేసే పైపులైన్‌కు రంధ్రం ఏర్పడింది. రావాడ పంచాయతీ పరిధి బొట్టవానిపాలెం ప్రధాన రహదారికి ఆనుకొని రంధ్రం ఏర్పడటంతో నీరు వృథా అవుతోంది. ఏలేరు కాలువ నుంచి తాడి వద్ద గల ఏపీఐఐసీ పంప్‌హౌస్ ద్వారా సెజ్‌కు నీటి సరఫరా జరుగుతోంది. అయితే రెండేళ్ల క్రితం ఎలమంచిలి- గాజువాక ప్రధాన మార్గంలోని బొట్టవానిపాలేనికి చెందిన కారుకొండ కన్నయ్య ఇంటికి సమీపంలో భూమి అడుగు భాగాన పైపులైన్‌కు రంధ్రం ఏర్పడటంతో పెద్ద ఎత్తున నీరు వృథా అవుతోందన్నారు. ప్రధాన రహదారి గుండా నీరు పారుతూ సమీపంలో గల వ్యవసాయ భూమిలోకి చేరుతోంది. ఈ క్రమంలో ఇక్కడ పెద్ద ఎత్తున నీరు వృథా అవడం ఏపీఐఐసీ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలిస్తోంది. వీరి తీరు పట్ల స్థానికులు మండిపడుతున్నారు. రెండేళ్లుగా నీరు వృథాగా పోతున్నా పట్టించుకోకుండా నిద్రమత్తులో ఉన్నారా అని ప్రశ్నిస్తున్నారు. వృథాగా పోతున్న నీరంతా సమీపంలోని పొలాల్లోకి చేరడంతో తమ భూములన్నీ చౌడు పట్టిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా మేల్కొని తాగునీటి వృథాకు అడ్డుకట్ట వేయడంతో పాటు పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం: సీఐ


విద్యార్థులతో మాట్లాడుతున్న ఈగల్ టీమ్ సీఐ రవికుమార్, పక్కన ఏఎస్ఐ, తదితరులు

అనంతగిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని అల్లూరి జిల్లా ఎన్‌డీపీఎస్ సీఐ రవికుమార్ సూచించారు. స్థానిక జూనియర్ కళాశాలలో సోమవారం ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ. గంజాయి, డ్రగ్స్ వ్యసనాలతో ఆరోగ్యం పాడవుతుందని, క్షణికావేశంలో చేసిన తప్పులకు జైలు పాలవాల్సి వస్తోందని హెచ్చరించారు. వ్యసనాలకు దూరంగా కుటుంబాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలోని కళాశాల ప్రిన్సిపల్ ప్రమీల, ఏఎస్ఐ రాజాం నాయుడు, అధ్యాపకులు తౌటినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆచూకీ లభ్యం


విద్యార్థినులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్ఐ రమణ, సిబ్బంది

పెదబయలు, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాల నుంచి అదృశ్యం అయిన ఇద్దరు విద్యార్థినుల ఆచూకీ లభించినట్టు పాడేరు డీఎస్పీ షహబాజ్ అహమద్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల-1 లో 6వ తరగతి చదువుతున్న పొయిబ వసంత, 5వ తరగతి విద్యార్థి పొయిబ తేజశ్రీ ఈ నెల 6న పాఠశాల నుంచి అదృశ్యమన్నారు. 7వ తేదీన పాఠశాల హెచ్ఎం నారాయణ ఫిర్యాదు మేరకు పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ కొల్లి రమణ మూడు బృందాలతో గాలింపు చేసి ఈ నెల 10వ తేది సోమవారం చిన్నారులను పట్టుకున్నారు. వారినుంచి ఆరా తీయంగా చదువుకు భయపడి పాఠశాల నుంచి బయటకు వెళ్ళామని తెలిపారు. తల్లిదండ్రులు దండిస్తారని ఊరు శివారు కొండపై ఉన్నట్టు వారు చెప్పారని డీఎస్పీ తెలిపారు. వీరిని స్టేషన్‌కు తీసుకువచ్చి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్టు చెప్పారు.

డొంకరాయి కెనాల్ గ్రౌటింగ్ పనులు పూర్తి


కెనాల్‌లోకి నీటిని విడుదల చేసిన దృశ్యం

సీలేరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్స్‌లోని డొంకరాయి పవర్ కెనాల్ గ్రౌటింగ్ పనులు పూర్తయినట్టు సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్‌కో సీఈ కేవీ రాజారావు తెలిపారు. సోమవారం ఉదయం కెనాల్‌ను పరిశీలించి ఎల్‌సీని రిటన్ చేసి కెనాల్‌ను వినియోగంలోకి తీసుకువచ్చినట్టు తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి వరకు కెనాల్ వెప్ వాల్స్ నుంచి తలెత్తిన లీకులను 85 సిమెంట్ బస్తాలను వినియోగించి గ్రౌటింగ్ చేయడంతో పరిష్కరించినట్టు చెప్పారు. ఆదివారం ఉదయం ఏడున్నర నుంచి కెనాల్‌లోకి నీటి విడుదలను అంచెలంచెలు గా పెంచి పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని గ్రిడ్ అధికారుల ఆదేశాల మేరకు వినియోగంలోకి తీసువచ్చినట్టు చెప్పారు.

రూ. 17 లక్షలతో డ్రైనేజీల నిర్మాణం

చింతపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంతర్ల, సాయినగర్‌లో రూ.17లక్షల తో డ్రైనేజీలు నిర్మాణం, సామాజిక భవనం మరమ్మతులు చేపడుతున్నట్టు స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి అన్నారు. సోమవారం డ్రైనేజీ నిర్మాణ పనులకు జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్ దురియా పుష్పలతతో కలిసి ఎంపీపీ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ-1 దాసరి ధారలక్ష్మి, ఎంపీటీసీ-2 జయలక్ష్మి, వైసీపీ నాయకులు జల్లి సుధాకర్, బూసరి కృష్ణ, సాగిన గంగన్నపడాల్ పాల్గొన్నారు.

లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా జోగులు



అనంతగిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అనంతగిరికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ మొస్య జోగులును ఆంధ్రప్రదేశ్ లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అనంతగిరి 2002లో ఎంపీటీసీ గెలుపొందారు. 2014 టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు పనిచేశారు. తరువాత జిల్లాకార్యవర్గ సభ్యుడు పనిచేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.బుజ్జిబాబు, టి. ఆనందరావు, లక్ష్మణరావు, నరేంద్ర, నిర్మల, హర్షం వ్యక్తం చేశారు.

హైడ్రో ప్రాజెక్టులకు వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశం

అనంతగిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, వైసీపీ మండల అధ్యక్షుడు సూర్యనారయణ, గుమ్మకోట, టోకూరు సర్పంచ్‌లు పాగి అప్పారావు, కిల్లో మొస్య, రూతు మాట్లాడుతూ. హైడ్రో పవర్ ప్రాజెక్టుకు అనుమతులు రద్దుచేసే వరకు పోరాటం చేస్తామన్నారు. వాలసీ సర్పంచ్ సన్యాసిరావు, చిన్నరావు, చందరరావు, సుందరరావు, దేముడమ్మ, తదితరులు పాల్గొన్నారు.


పాడేరులో అఖండ దీపారాధన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు


సీలేరు శివాలయంలో లక్ష భిల్వార్చన, సామూహిక కుంకుమార్చనలు

హరహర మహాదేవ శంభో శంకర

- వాడవాడలా కార్తీక మూడో సోమవారం
- కిటకిటలాడిన ఆలయాలు

పాడేరురూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు శివాలయాలు కార్తీక మాసం 3వ సోమవారం సందర్భంగా కిటకిటలాడాయి. పాడేరు లో ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రధాన అర్చకులు ఉప్పల రామం పంతులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు ఆలయ ప్రాంగణంలోని వివిధ దేవతామూర్తుల విగ్రహాలకు, ధ్వజ స్తంభం, ఉసిరి, రావి, మర్రి తదితర వృక్షాలకు భక్తి శ్రద్ధలతో పూజలను చేపట్టారు. భక్తులకు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, ఆధ్యాత్మిక ధర్మకర్త కొట్టగుళ్లి రమాదేవి పర్యవేక్షణలో తీర్థ ప్రసాదాలు, పాలు, మజ్జిగను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, కె.భాగ్యలక్ష్మి, ఉప్పల వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు. పూర్ణ పుష్కల సమిత అయ్యప్ప స్వామి ఆలయంలోని సోమనాదేశ్వ స్వామి ఆలయాన్ని వందలాది మంది భక్తులు దర్శించి ప్రధాన అర్చకుడు ప్రవీణ్ శర్మ ఆధ్వర్యంలో పూ చేపట్టారు. భక్తులకు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సుబ్బారావు ఆధ్వర్యంప్రసాదాలు, తాగునీరు అందించారు. పట్టణంలో స్వయం భూగౌరీలింగేశ్వరస్వామి ఆలయం, త్రిముఖ లింగేశ్వర స్వామి, సంగోడి గ్రామంలోని స్పటిక లింగేశ్వరస్వామి, వంతాడపల్లి శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలను చేపట్టారు.

ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన ఆకాశ దీపారాధనలో ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర లక్ష్మణమూర్తి దంపతులుపాల్గొని పూజలను చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు అఖండ దీపారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు కె.రమాదేవి, సర్వతి, కాత్యాయని తదితరులు పాల్గొన్నారు.


పాడేరులోని సోమనాథేశ్వర స్వామికి బిల్వార్చన

సీలేరులో

సీలేరు: సీలేరు శివాలయంలో మహిళలు తెల్లవారుజాము నుంచి చేరుకున్నారు.ప్రాంగణంలోని ధ్వజ స్తంభం, రావి చెట్టు వద్ద 360 ఒత్తుల దీపాలను వెలిగించి పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మహాన్యాస రుద్రాభిషేకం, లక్ష భిల్వార్చనలను వేదపండితులు నిర్వహించారు. సాయంత్రం ఆకాశదీపం కార్యక్రమం అనంతరం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొయ్యూరు: కొయ్యూరు మల్లికార్జునస్వామి ఆలయం, వలసంపేట గిజా సమేత తాండవేశ్వర స్వామి, పెద మాకవరం, మాలమాకవరం బ్రహ్మలింగేశ్వర, బాలారం కాశీ అన్నపూర్ణ సహిత బ్రహ్మ లింగేశ్వర ఆలయాలు తెల్లవారు జాము నుంచి భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీలు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఆలయాల వద్ద అన్న సమారాధన, పులిహోర ప్యాకెట్లను పంపిణీ చేశారు.


మాకవరం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు


దీపారాధనలో జడ్పీ చైర్ పర్సన్ సుభద్ర దంపతులు, మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

అమరులైన ఉద్యోగుల సేవలు చిరస్మరణీయం: డీఎఫ్‌వో

చింతపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వాహణలో అమరులైన అటవీ ఉద్యోగుల సేవలు చిరస్మరణీయమని స్థానిక డివిజనల్ ఫారెస్టు అధికారి (డీఎఫ్‌వో) వై. వెంకట నరసింహరావు అన్నారు. సోమవారం అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని అటవీశాఖ ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. తొలుత డివిజన్ కార్యాలయంలో అమరులైన అటవీశాఖ ఉద్యోగులకు నివాలర్పించారు. అనంతరంర్యాలీ చేశారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ విధినిర్వహణలో అమరులైన ఉద్యోగుల ఆశయసాధనకు ప్రతి ఒకరు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారులు చింతపల్లి, లోతుగెడ్డ, పెదవలస, మర్రిపాకలు రేంజ్ అధికారులు బి. అప్పారావు, జె. ప్రశాంతి కుమారి, సీహెచ్ సింహాచలంపడాల్ పాల్గొన్నారు.

పెదబయలు: స్థానిక అటవీ శాఖ కార్యాయంలో అటవీ అమరవీరుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పెదబయలు రేంజ్ అధికారి రవికుమార్ ఆధ్వర్యంలో అమరుల చిత్రపటాలకు పూలమాలలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారిని సుజనాశ్రీ, బీట్ అధికారులు రుక్మిణి, అనూష, నీలకంఠం, సుధాకర్ సిబ్బంది పాల్గొన్నారు.


చింతపల్లిలో ర్యాలీ చేస్తున్న డీఎఫ్‌వో వైవీ నరసింహరావు, ఉద్యోగులు

అన్ని గ్రామాలకు ఎల్‌ఈడీ వీధి దీపాలు

- అరకు ఎంపీ తనూజరాణి


ఎల్‌ఈటీ బల్బులు అందిస్తున్న ఎంపీ , పక్కన ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్

ముంచంగిపుట్టు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దశలవారీగా అన్ని గ్రామాలకు ఎల్‌ఈటీ వీధి దీపాలను పంపిణీ చేస్తామని అరకు ఎంపీ గుమ్మ తనూజరాణి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీ నిధులతో కొనుగోలు చేసిన ఎల్‌ఈడీ బల్బుల పంపిణీ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఎంపీతో పాటు జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంల చేతుల మీదుగా సర్పంచులు, ఎంపీటీసీ సభ్యుల కు ఎల్‌ఈడీ బల్బులను అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎంపీ నిధులతో మొదటి విడతగా మండలంలో 23 పంచాయతీల పరిధిలో రూ.14లక్షల ఎంపీ నిధులతో 280 ఎల్‌ఈడీ బల్బులు మంజూరు చేసినట్టు చెప్పారు. అలాగే రూ. లక్ష 20వేలతో స్థానిక సీహెచ్‌సీ, అంబేడ్కర్ పార్కుల ఆవరణలో సోలార్ విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎ. సీతమ్మ, వైస్ ఎంపీపీ భాగ్యవతి, ఎంపీడీవో ధర్మారావు, తహశీల్దార్ భాస్కరఅప్పారావు, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, పీఆర్ఏఈ మురళీకృష్ణ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

- జడ్పీ చైర్‌పర్సన్ జల్లెపల్లి సుభద్ర
- మండల సమావేశానికి గైర్హాజరైన అధికారులపై ఆగ్రహం


సమావేశంలో మాట్లాడుతున్న సుభద్ర

హుకుంపేట నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి); రాజకీయ పార్టీలతో సంబంధంలేకుండా అధికారులు, నాయకులు కలిసి అభివృద్ధికి కృషి చేయాలని విశాఖ ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ సుభద్ర సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కూడా రాజుబాబు అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం తర్వాత నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. హైడ్రో ప్రాజెక్టు నిర్మాణాలను వ్యతిరేకించాలన్నారు. పేదలకు ప్రభుత్వ విద్య దూరం చేస్తున్నారన్నారు. హుకుంపేటలో గిరిజన నేతరులు అక్రమంగా గృహలు నిర్మాణాకు స్థానిక తహశీల్దార్‌పై ఎల్ టీ ఆర్ కేసులు నమోదు చేసేలా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్తానన్నారు. మండల సమావేశనికి ఏటీడబ్ల్యూవో హాజరు కాకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమాదేవి, ఎఓ సత్యనారయణ, మండల ఇంజనీరింగ్ అధికారి సంజీవరావు, పంచాయతీరాజ్ డీఈ ధ్రువ, ఆర్ డబ్ల్యూఎస్ జేఈ జగదీశ్‌బాబు, ఎంఈఓ చెల్లయ్య, ఆర్ఐ సీతమ్మ, వైస్ ఎంపీపీ సుశీల కొండలరావు, ఎంపీటీసీ సభ్యులు కొమ్మ రమ , సర్పంచ్ పూర్ణిమ్మ పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యం'


టీడీపీ మండల పార్టీ సమావేశానికి హాజరైన నాయకులు

చింతపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు అన్నారు. సోమవారం స్థానిక గిరిజన భవన్‌లో టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అధ్యక్షతన పార్టీ కార్యకర్తలు, గ్రామ కమిటీ అధ్యక్షుల సమావేశం జరిగింది. తొలుత టీడీపీ సీనియర్ నేత బేతా నూకరత్నం మృతికి నాయకులు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ వైసీపీ పాలనలో గిరిజన గ్రామాల దయనీయ స్థితికి చేరుకున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జోరుగా అమలవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ హష్వంత్, టీడీపీ సీనియన్ నాయకుడు రీమల ఆనందరావు, లక్కోజు నాగభూషణం, రమణ, ఐటీడీపీ ఇన్‌చార్జి మహేంద్ర, మాజీ మండలాధ్యక్షుడు బేరా సత్యనారాయణ పడాల్ పాల్గొన్నారు.

కాఫీ కార్మికులతో చర్చలు విఫలం

- యథాతథంగా సమ్మె


సంఘం నాయకులు, కార్మికులతో చర్చిస్తున్న ఏపీఎఫ్‌డీసీ అధికారులు

చింతపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీఎఫ్‌డీసీ డివిజన్ కార్యాలయంలో సంస్థ అధికారులు, కార్మికుల మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో సమ్మెను యథావిధిగా కొనసాగిస్తామని కార్మికులు స్పష్టం చేశారు. కాఫీ కార్మికుల సమస్యలపై ఈనెల ఆరోవ తేదీ నుంచి సమ్మె చేపడుతున్నారు. దీంతో ఏపీఎఫ్‌డీసీ అధికారులు సోమవారం చర్చలు జరిపారు. ఏపీఎఫ్‌డీసీ నుంచి పాడేరు, చింతపల్లి, ఆర్‌వీనగర్, నర్సీపట్నం డివిజనల్ మేనేజర్లు కృష్ణబాబు, రత్నదీపిక, త్రిమూర్తులు రెడ్డి, సత్యం, పదవీ విరమణ పొందిన డివిజనల్ మేనేజర్ ఎం. మహేశ్వరరావు హాజరుకాగా కాఫీ కార్మిక సంఘం నుంచి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్, జిల్లా అధ్యక్షుడు ఎల్. సుందరరావు, నాయకులు జి. సత్యనారాయణ, కార్మికులు పాల్గొన్నారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ చర్చలు జరిగాయి. కాఫీ తోటల సం రక్షణకు అదనపు ఉద్యోగులను నియమించాలని కోరారు. వీడీఏ కరువు భత్యం పాయింట్లకనుగుణంగా రోజు కూలి, పండ్ల సేకరణ ధర పెంచాలని కార్మికులు కోరారు. దీంతో జీవో వచ్చాక ధరలు పెంచుతామని అధికారులు సమాధానం ఇచ్చారు. కాఫీ కార్మికుల నివాస గృహాలు మరమ్మతులు చేపట్టాలని కోరారు. తెలిపారు. ఈ ప్రధాన డిమాండ్లపై అధికారులు, కార్మికుల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో కార్మికులు, నాయకులు సమ్మె కొనసాగిస్తామని అధికారులు తెలియజేసి చర్చల నుంచి బయటకు వచ్చేశారు. ఏపీఏఐటీయూసీ కాఫీ వర్కర్స్ యూనియన్ నాయకులు సత్యాంజనేయులు, అమర్, సత్తిబాబు, దేవరాజు వేరుగా ఏపీఎఫ్‌డీసీ అధికారులతో చర్చలు నిర్వహించారు. అనంతరం ఏఐటీయూసీ, సీఐటీయూసీ నాయకులు వేర్వేరుగా ప్రకటనలు ఇవ్వడం వల్ల కార్మికులు గందరగోళానికి గురవుతున్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన సోమ కుటుంబసభ్యులు

- కుమారుడికి డీటీ ఉద్యోగం, ఇంటి స్థలం కేటాయింపుపై కృతజ్ఞతలు


సీఎం చంద్రబాబునాయుడును కలిసిన సీవేరి సోమ కుటుంబ సభ్యులు

అరకులోయ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును దివంగత నేత సీవేరి సోమ కుటుంబసభ్యులు అమరావతిలో కలిసి సోమ కుమారుడికి ఉద్యోగం, స్థలం మంజూరు చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. సోమ పెద్ద కుమారుడు మాజీ ఎస్టీ కమిషన్ సభ్యుడు సీవేరి అబ్రహం స్థానిక విలేకరులకు అందించిన వివరాలివి.. గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆధ్వర్యంలో సోమవారం సీఎంను కుటుంసమేతంగా కలిశారు. తన సోదరుడు సురేశ్‌కుమార్‌కు డిప్యూటీ తహశీల్దార్ ఉద్యోగంతోపాటు విశాఖపట్నంలో ఇంటిస్థలం కేటాయించడంపై ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం కుటుంబానికి ఎప్పుడూ అండగా ఉంటామని, పార్టీకి కష్టపడి పని చేయాలని సూచించారు. పార్టీకి విధేయులుగా పనిచేస్తామని అబ్రహం ఈ సందర్భంగా తెలిపారు.ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మంత్రి సంధ్యారాణి, సోమ సతీమణి ఇచ్చావతి, కుమారుడు, సీవేరి అబ్రహం, భార్యా, పిల్లలు, డీటీగా పోస్టింగ్‌పొందిన సురేశ్‌కుమార్ ఉన్నారు.

మద్దిగరువును మండల కేంద్రంగా మార్చాలి: గిడ్డి ఈశ్వరి


కలెక్టర్ కార్యాలయం వద్ద మండల సాధన కమిటీ ప్రతినిధులతో ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

పాడేరురూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మద్దిగరువును మండల కేంద్రంగా చేయాలంటూ జి.మాడుగుల, పెదబయలు మండలాలకు చెందిన 10 గ్రామ పంచాయతీల ప్రజలు పాడేరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరితో కలిసి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ పెదబయలు మండలానికి చెందిన జామిగూడ, ఇంజరి, గిన్నెలకోట, బొంగరం, లింగేటి, గుల్లెలి, కుంతుర్ల, జి.మాడుగుల మండలానికి చెందిన కిల్లంకోట, బొయితిలి, నుర్మతి పంచాయతీలకు చెందిన ప్రజలు మద్దిగరువు గ్రామాన్ని మండల కేంద్రంగా చేయాలని కోరుకుంటున్నారని ఆమె తెలిపారు. తెలుగు యువత అధ్యక్షుడు, పాడేరు పీఏసీఎస్ చైర్మన్ డప్పోడి వెంకటరమణ, జి.మాడుగుల ఎంపీపీ ఎల్.అప్పలరాజు, 10 పంచాయతీల సర్పంచ్‌లు, గ్రామపెద్దలు, పెసా కమిటీ సభ్యులున్నారు.

ఆస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితం: డీసీహెచ్‌ఎస్


గర్భిణులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్

చింతపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు ఆస్పత్రిలో ప్రసవం పొందడం సురక్షితమని జిల్లా ఆస్పత్రుల సేవలు స మన్వయకర్త (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ ఎం. నీలవేణి అన్నారు. సోమవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రధాన మంత్రి సురక్షిత మం త్రిత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 210 మంది గర్భిణులకు స్త్రీ వైద్యనిపుణులు వాసవి, శ్రీలతలు వైద్యపరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లు నిర్వహించారు. ఈసందర్భంగా డీసీహెచ్‌ఎస్ గర్భిణులతో మాట్లాడుతూ తొమ్మిది నెలల్లో ఒక్కసారైన స్కానింగ్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, నర్సులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పూజ


పేటతుళ్లు ఆడుతూ స్వామివారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న మాలధారులు

పాడేరురూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మోదకొండమ్మ ఆలయ ప్రాంగణంలో సోమవారం అయ్యప్ప సన్నిధానం పూజను ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప పీఠం గురుస్వాములు రామేశ్వరరావు, రాజబాబులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గురుస్వాములు వెయ్యాకుల సత్యనారాయణ, ఏడుకొండలు ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో పూజలను చేపట్టారు. సాయంత్రంమాలధారులు కోయవేషంలో పేటతుళ్ళి ఆడుతూ సుంద్రుపుట్టు సాయిబాబా ఆలయం నుంచి భారీ ఊరేగింపుతో సన్నిధానానికి చేరుకున్నారు. పూజ తర్వాతమాలధారులకు అల్పాహారం అందించారు.

మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్‌పై గ్రామసభ


సమావేశంలో మాట్లాడుతున్న పీవో శ్రీపూజ, పక్కన అసిస్టెంట్ కలెక్టర్, డీఎఫ్‌వో

అరకులోయ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్‌ను అటవీశాఖ ఆధ్వర్యంలో ఎకోటూరిజం ప్రాజెక్టుగా అభివృద్ధి చేయాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఐటీడీఏ పీవో శ్రీపూజ, అసిస్టెంట్ కలెక్టర్ , పా డేరు డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి, ఎంపీడీవో లవరాజు, తహసీల్దార్ సోమవారం సాయంత్రం మాడగడ సర్పంచ్ పాడిబారికి జ్యోతి అధ్యక్షతన మాడగడ పంచాయతీ ఆవరణలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో శ్రీపూజ మాట్లాడుతూ రికార్డులను అనుసరించి ఎకో టూరిజం ప్రాజెక్టుగా అభివృద్ధి చేస్తామని, ఇప్పటి వరకు ఇక్కడ జీవనోపాధి పొందుతున్న ఎటువంటి ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు. అయితే, వచ్చే ఆదాయంలో గ్రామస్థులు 80 శాతం అడిగారు. తాము 50 శాతం ఇస్తామని చెబుతున్నామని పీవో తెలిపారు. ఈ సందర్భంగా మాడగడ పెసా కమిటీ అధ్యక్ష, కార్య దర్శి, యువకులు మాట్లాడుతూ వచ్చిన ఆదాయంలో 80శాతం చెల్లించాలని, ఏ నెలకు ఆ నెల సెటిల్ చేయాలని, యువతకు ఉపాధి చూపాలని డిమాండ్ చేశారు.

గృహ నిర్మాణ బిల్లుల కోసం ఆందోళన

ముంచంగిపుట్టు, నవంబరు 10, (ఆంధ్రజ్యోతి): గృహ లబ్ధిదారులకు బకాయి ఉన్న బిల్లులను వెంటనే మంజూరు చేయాలని గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎం.శ్రీను, కె.నర్సయ్యలు అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో గృహ లబ్ధిదారులు బకా బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలో భారీ ఆందోళన కార్యక్రమం చేపట్టారు. తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. వినతి పత్రాలను తహశీల్దార్ భాస్కరరావు, హౌసింగ్ ఏఈ కృష్ణారావులకు అందించారు. వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ, లక్ష్మీపురం సర్పంచ్ కె.త్రినాథ్, గిరిజనం సఘం నేతలు నారాయణ, సీతారాం, డొంబ్రు, దళపతి, భీమరాజు, శంకరరావు, గణపతి, లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హుకుంపేట: గృహ లబ్ధిదారులకు వెంటనే బిల్లు మంజూరు చేయాలని గిరిజన సంఘ జిల్లా అధ్యక్షులు టి. కృష్ణారావు కోరారు. సోమవారం లబ్ధిదారులతో కలిసి ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. రెవిన్యూ ఉద్యోగి కంబిడి కృష్ణకుమారికి వినతిపత్రం అందజేశారు.

జి.మాడుగుల : పీఎం జన్‌మన్ గృహాల లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మనడాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. గిరిజన సంఘం నాయకులు నాగేశ్వరరావు, చిన్నారావు, సీతారాం, సుబ్బారావు, ప్రసాద్, సన్యాసిరావు, గణేశ్ పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

23న వంతెన నిర్మాణానికి శంకుస్థాపన

▸▸ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

దేవరాపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేవరాపల్లి-కొత్తవలస రోడ్డులో కృష్ణారాయుడుపేట వద్ద వంతెన నిర్మాణానికి ఈ నెల 23న శంకుస్థాపన చేస్తామని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. బి.కింతాడలో దుర్గాదేవి ఆలయం వద్ద వనభోజన కార్యక్రమంలో సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ రూ.91 లక్షల జీవీఎంసీ నిధులతో జరగనున్న ఈ కార్యక్రమానికి జీవీఎంసీ కమీషనర్, మేయర్‌లను ఆహ్వానించామన్నారు. మహిళలకు ఉపాధి అవకాశాల కల్పనకు బ్రాండిక్స్ ప్రతినిధితో మాట్లాడతామని, గ్రామాలకు బస్సుల వచ్చేలా చర్యలు చేపడతామని చెప్పారు. కాశీపురం, గవరవరం రోడ్డు పనులు కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. బి.కింతాడ, కాశీపురం, రైవాడ గ్రామాల్లో ఈ నెల 13వ తేదీలోగా గ్రామ కమిటీల ప్రమాణ స్వీకారం జరిగేలా అధ్యక్ష, కార్యదర్శులు బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీవీజీకుమార్, కిలపర్తి భాస్కరరావు పాల్గొన్నారు.

పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు

▸▸ చోడవరం ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు


కోటేశ్వరరావు జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే రాజు

చోడవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో కష్టపడి పని చేసే కార్యకర్తలకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు తెలిపారు. టీడీపీ పట్టణ నాయకుడు కోటేశ్వరరావు జన్మదిన వేడుకలను పార్టీ కార్యాలయంలో సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గూనూరు మల్లునాయుడు, మత్స్యరాజు, ఎర్రంశెట్టి చిన్న, గూనూరు సురేశ్, గొర్లె సుధాకర్, ఈర్లె శ్రీనివాస్, కొట్టాపు చిన్న, నేమాల హరి, జనసేన నాయకుడు గూనూరు మూలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బి.కింతాడలో దుర్గమ్మకు ప్రత్యేక పూజలు


తాతయ్యబాబు, పీవీజీ కుమార్‌లను సత్కరిస్తున్న నాయకులు

దేవరాపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బి.కింతాడ గ్రామంలో దుర్గాదేవి అమ్మవారిని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, రాష్ట్ర కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ.కుమార్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సోమవారం దర్శించుకున్నారు. తెలుగు రైతు ఆర్గనైజింగ్ కార్యదర్శి కడిమి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం కార్తీక వనభోజనాలు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం కూటమి నాయకులు శాలువాలతో వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పారిశుధ్య కార్మికుల నిరసన


తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

మాకవరపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ పారిశుధ్య కార్మికులు నిరసన తెలిపారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ నేత ఈరెల్లి చిరంజీవి ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రతి రోజూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతామని, కరోనా సమయంలో కూడా ఎన్ని ఇబ్బందులు ఉన్నా పని చేశామని, చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామని ఈ సందర్భంగా వారు ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు ఇవ్వడంతో పాటు సమయానికి చెల్లించాలని కోరారు. అనంతరం తహశీల్దార్ వెంకటమణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కిత్తయ్య, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డు పనులు చేపట్టాలని నిరాహార దీక్ష



రిలే నిరాహార దీక్ష శిబిరంలో కూర్చొన్న ఆదివాసీ మహిళలు

చోడవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీఎన్ రోడ్డు పనులను త్వరగా చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ మహిళలు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట చేపట్టిన ఈ దీక్షలు సోమవారంతో 15వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ కొణతాల హరినాథ్ మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మించి ప్రజలకు ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరారు. ఆదివాసీ మహిళా సంఘం నేతలు శాంతకుమారి, తాటి కొండమ్మ, కొర్ర ఈశ్వరి, అల్లూరి జిల్లా ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు ఎస్.గంగరాజు దీక్షలో కూర్చొన్నారు.

గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నాతవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చినగొలుగొండపేట వద్ద రూ.8 లక్షల వ్యయంతో గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ అధికారులతో కలిసి ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఆపరేషన్ మెయింటెనెన్స్ నిధులతో ఈ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. కోట నందూరు మేజర్ పరిధిలో 3-1 నుంచి 3-8 వరకు ఈ పనులు చేస్తున్నట్టు చెప్పారు. దశాల వారీగా తాండవ అక్విడెట్ మరమ్మతు పనులు, ఇతర అభివృద్ధి పనులు చేస్తున్నట్టు ఆయన తెలిపారు వచ్చే వేసవిలో నిమ్మల రామునాయుడు ద్వారా మరిన్ని నిధులు మంజూరైన తర్వాత తాండవ అభివృద్ధి పనులు చేపడతామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో గునుపూడి నీటి సంఘం అధ్యక్షుడు ఎస్.దేముడు, తెలుగుయువత మండల అధ్యక్షుడు పోలుపర్తి సాయి, జేఈ దుర్గబాబు, తాండవ సిబ్బంది నాగబాబు పాల్గొన్నారు.

ఆలయాల్లో శివ నామస్మరణ

స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు


నర్సీపట్నం బ్రహ్మలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు


.. బుచ్చెయ్యపేట: సీతయ్యపేట శివాలయంలో సామూహిక పూజలు చేస్తున్న భక్తులు

నర్సీపట్నం/బుచ్చెయ్యపేట/మాడుగుల/దేవరాపల్లి/కె.కోటపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా శివ నామస్మరణతో మార్మోగాయి. నర్సీపట్నంలోని బలిఘట్టం బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారు జాము నుంచే భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాఏ బుచ్చెయ్యపేట మండలంలోని సీతయ్యపేట రామభోగ లింగేశ్వరస్వామి, వడ్డాది రామలింగేశ్వరస్వామి, భ్రమరాంబిక మల్లికార్జునస్వామియాయాల్లో అభిషేకాలు, పూజలు చేశారు. మాడుగుల మండలంలో శివాలయాలకు కార్తీక మాస శోభ సంతరించుకున్నాయి. భీమలింగేశ్వరస్వామి, ఉబ్బలింగేశ్వరస్వామి, స్వర్ణ లింగేశ్వరస్వామి, కృష్ణభూపాలేశ్వరస్వామి, కాశీవిశ్వనాథస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. దేవరాపల్లి ఉమామహేశ్వరస్వామి, వనదేవీశ్వర, తిమిరాం, చిననందిపల్లి, పెదనందిపల్లి, తెనుగుపూడి, బి.కింతాడ, శివాలయాలతో పాటు వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కె.కోటపాడు మండలంలోని శివాలయాలు హర హర మహాదేవ శంభో శంకర అంటూ మార్మోగాయి. కె.కోటపాడులో శివాలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.



దేవరాపల్లి: తిమిరాంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు.. మాడుగుల భీమలింగేశ్వరస్వామి ఆలయంలో..

రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా కొండనాయుడు

రావికమతం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాపు కార్పొరేషన్ బోర్డు డైరెక్టర్‌గా టి.అర్జాపురం గ్రామానికి చెందిన రాజాన కొండనాయుడు నియమితులైయ్యారు. కూటమి ప్రభుత్వం సోమవారం రాష్ట్రంలో మరో పది కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమించింది. టీడీపీ కోటాలో చోడవరం నియోజకవర్గం నుంచి సీనియర్ నేత రాజాన కొండనాయుడుకు ఈ అవకాశం దక్కింది. కొండనాయుడు టి.అర్జాపురం సర్పంచ్‌గా, టీడీపీ మండల అధ్యక్షుడిగా పని చేశారు. నాయకులకు, ప్రజలకు సుపరిచితులుగా మెలుగుతూ పార్టీ కార్యకలాపాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ఆయన భార్య రాజాన శ్రీవాణిని జడ్పీటీసీ సభ్యురాలుగా గెలుపించుకున్నారు. కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన ఆయనకు రావికమతం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఉప్పులూరి నాగేశ్వరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బంటు శ్రీను, టీడీపీ నాయకులు, అభిమానులు పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహూకరించారు.


రాజాన కొండనాయుడును సత్కరించి అందిస్తున్న టీడీపీ శ్రేణులు

అటవీ ఉద్యోగుల సేవలు చిరస్మరణీయం

విశాఖపట్నం ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో సునీల్‌కుమార్

కృష్ణాదేవిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అటవీ సంపద సంరక్షణలో అమరులైన అధికారులు, సిబ్బంది సేవలు చిరస్మరణీయమని విశాఖపట్నం ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో ఎ.సునీల్‌కుమార్ అన్నారు. గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేట అటవీ కార్యాలయంలో అమరవీరుల చిత్రపటాలకు సోమవారం పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీ చేస్తూ అటవీ అమరవీరులకు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అటవీ అమరవీరులు సంస్మరణ దినం సందర్భంగా వారి త్యాగాలను గుర్తుంచుకోవడానికి ఈ కార్యక్రమం చేస్తున్నామన్నారు. అలాగే ఉద్యోగులు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అటవీ సంపద సంరక్షణతో పాటు కలప అక్రమ రవాణా నిర్మూలనకు ప్రత్యేక నిఘా పెట్టాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి కె.శ్రీనివాసరావు, డిప్యూటీ రేంజ్ అధికారి వి.సత్యనారాయణ, గొలుగొండ సెక్షన్ అధికారి కె.వెంకటరమణ, గార్డులు సత్యనారాయణ, రాణి, గణపతి, బేస్ కాంప్ సిబ్బంది పాల్గొన్నారు.


అమరువీరుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న డీఎఫ్‌వో, ఉద్యోగులు

రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో చోడవరం యువకుడికి స్వర్ణం

చోడవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 69వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పట్టణానికి చెందిన యువకుడు నల్లమిల్లి సుందర రామారెడ్డి రైఫిల్ షూటింగ్ పోటీల్లో విజేతగా నిలిచి స్వర్ణ పతకం సాధించాడు. విశాఖ నగరంలోని స్కూల్‌లో చదువుతున్నాడు. ఆయన రైఫిల్ షూటింగ్‌లో ప్రావీణ్యం ఉన్న సుందరరామిరెడ్డి జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించాడు. ఈ నెల 8న ఒంగోలులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా సుందరరామిరెడ్డి సత్తాచాటి పతకం సాధించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రైఫిల్ షూటింగ్ పోటీల విజేత సుందరరామారెడ్డికి పతకం బహూకరిస్తున్న నిర్వాహకులు

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జోగంపేట విద్యార్థుల ఎంపిక

గొలుగొండ: మండలంలోని జోగంపేట ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. మాకవరపాలెం మండలంలో జరిగిన జిల్లా స్థాయిలో పోటీల్లో జి.లీలా విష్ణువర్ధన్, ఎం.నూకరత్నం, ఆర్.స్వాతిక ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. హైస్కూల్ హెచ్‌ఎం నాగభూషణం, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.


నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

బుచ్చెయ్యపేట నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట సోమవారం సంస్థ ఉద్యోగులు నిరసన తెలిపారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, తమను సంస్థలో విలీనం చేయాలని నినాదాలు చేశారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రైవేటీకరణ విధానం ఆపాలని, బీమా సదుపాయం కల్పించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కోర్టు కేసులతో పెండింగ్‌లో ఉన్న జేఎల్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు వేపాడ సత్యనారాయణ, కె.నాగఅప్పారావు, కె.కొండలరావు, నాయుడు, చంద్రరరావు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి అంబలం పూజ


అయ్యప్పస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

నర్సీపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామికి అంబలం పూజ ఉత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణ పురవీధుల్లో స్వామివారి రథోత్సవం నిర్వహించారు. అబీద్ సెంటర్, పాత బస్టాండ్ మీదుగా ఐదు రోడ్ల కూడలి, పోలీస్ స్టేషన్ మీదుగా పాల్‌ఘాట్ సెంటర్ నుంచి ఆలయం వరకు ర్యాలీ చేశారు. అయ్యప్పస్వామి శరణ ఘోషతో పట్టణ వీధులు మార్మోగిపాయాయి. అలాగే పల్లకీసేవ, పడి పూజ నిర్వహించారు. అనంతరం స్వాములకు వడి ఏర్పాటు చేశారు.

మధ్యాహ్న భోజన పథకంపై విచారణ


మధ్యాహ్న భోజన నిర్వాహకులను విచారిస్తున్న ఎంఈవో-2 నాగేంద్ర

నర్సీపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మునిపాలిటీ పరిధిలోని గచ్చపువీధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంపై ఎంఈవో-2 నాగేంద్ర విచారణ చేశారు. 'నాసిరకంగా బడి భోజనం' అనే శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం ఎంఈవో నాగేంద్ర-2 పాఠశాలలో విచారణ చేశారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు, ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలు సేకరించారు. వంట తయారు చేసే ముందు ఏయే సరకులు ఎంత వేస్తున్నారని ఆరా తీశారు. దీనిపై ఎండీఎం ఇన్‌చార్జి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ఈ విచారణలో గుర్తించిన లోపాలపై నివేదికను డీఈవోకు అందజేస్తామని ఎంఈవో-2 నాగేంద్ర తెలిపారు. విచారణలో ఎంఈవో-1 తలుపులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్టాండ్ ఎదుట సిమెంటు పలకలు శిథిలం

నర్సీపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్ దుకాణ సముదాయం ముందు కాలువ మీద సిమెంటు పలకలు శిథిలమయ్యాయి. ఇది జరిగి చాలా కాలమైనా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని ప్రయాణికుల నుంచి విమర్శలు వస్తున్నాయి. సిమ్మెంటు పలకలు వేయించకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మోటారు బైక్ స్టాండ్‌కు వెళ్లే వారు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తున్నదని వాపోతున్నారు. దుకాణాలకు వచ్చేవారు అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ కాలువ వల్ల పడిపోయి గాయాల పాలు అవుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి కల్వర్టు మరమ్మతులు పనులు తక్షణమే చేయించాలని వారు కోరారు.


ఆర్టీసీ బస్టాండ్ ముందు శిథిలమైన కల్వర్టు

నేడు టీడీపీ కమిటీలు, సంఘాల ప్రమాణ స్వీకారం

ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు



చోడవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రావికమతం మండలంలోని కల్యాణపులోవలో మంగళవారం నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి కమిటీలతో పాటు అనుబంధ సంఘాల పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి నాలుగు మండలాలకు చెందిన నాయకులు హాజరు కావాలని సూచించారు. ఈ సమావేశంలో రానున్న రోజుల్లో సంస్థాగతంగా పార్టీ బలోపేతంతో పాటు స్థానిక ఎన్నికలకు సమాయత్తమయ్యేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించే అంశాలపై చర్చిస్తామని ఆయన చెప్పారు.

ధర్మరక్షణ మండల కమిటీ ఏర్పాటు

నాతవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ధర్మరక్షణ నూతన మండల కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా శెట్టి నానాజీ (నాతవరం), ఉపాధ్యక్షులుగా యర్రా కాశీ (నాతవరం), ఎల్.సత్యనారాయణ (ఎస్‌బీపట్నం), బోత్సా దుర్గయ్య (మర్రిపాలెం), మాకిరెడ్డి నాగేశ్వరరావు (పార్వతీపురం), ప్రధాన కార్యదర్శిగా లోకవరపు నాగేశ్వరరావు (ఆర్‌పి అగ్రహారం), కోశాధికారిగా యర్రా భారతి (నాతవరం), సహ కోశాధికారి మేడిశెట్టి శివ (మాధవనగరం), కార్యదర్శులుగా పెట్ల జ్యోతి (మూలగపూడి), గండేపల్లి మరళి (వైబీ అగ్రహారం), కన్వీనర్ పైల రమణమ్మ (గొలుగొండపేట), మండల కమిటీ సభ్యులు శివాజీ (ఎంబీపట్నం), పి.పోతురాజు (ములగపూడి)లను ఎన్నుకున్నారు. ప్రతి పంచాయతీలోనూ ధర్మరక్ష కార్యక్రమాలు చేపట్టనున్నట్టు ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఘనంగా సీపీ బ్రౌన్ జయంతి

మాడుగుల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం తెలుగు, చరిత్ర విభాగాలు సంయుక్తంగా రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీవీఎస్‌ఎస్ శాస్త్రి మాట్లాడుతూ తెలుగు భాషకు సీపీ బ్రౌన్ చేసిన సేవలను కొనియాడారు. అంతేకాకుండా తెలుగు సాహితీ రంగానికి ఆయన చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. తెలుగు కావ్యాలను తెలుగు నిఘంటువులన తయారు చేయడంలో బ్రౌన్ కీలక పాత్ర పోషించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపన్యాసకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో రుణం ఇప్పించరూ..

నర్సీపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాతవరం మండలంలోని చమ్మచింత రెవెన్యూ పరిధిలోని వారసత్వంగా దాఖలా పడిన ఖాతా నంబరు 532, సర్వే నెంబరు 201లోని 2.12 ఎకరాలు జిరాయితీ మెట్ట భూమికి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మార్ట్‌గేజ్ రుణం ఇప్పించాలని జై భీమ్‌రామ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నేతల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం పీజీఆర్‌ఎస్‌లో ఆర్డీవో వీవీ.రమణకు వినతిపత్రం అందజేశారు. నాతవరం పీఏసీఎస్‌లో ఈ భూమిపై 1990లో మార్ట్‌గేజ్ రుణాలు ఇచ్చారని ఆయన తెలిపారు.

'వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం'

నర్సీపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం నిర్వస్తున్నామని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్ చెప్పారు. పట్టణంలోని పెదబొడ్డేపల్లి వైసీపీ కార్యాలయంలో సోమవారం ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీ నుంచి ప్రజా ఉద్యమం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల సన్యాసిపాత్రుడు, జిల్లా కార్యదర్శి రుత్తల ఎర్రాపాత్రుడు, గొలుగొండ జెడ్పీటీసీ గిరిబాబు, పెట్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వడ్డాదిలో వైసీపీ కోటి సంతకాల సేకరణ

బుచ్చెయ్యపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది గ్రామంలో వైసీపీ నాయకులు సోమవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ కుట్రపూరితంగా మెడికల్ కాలేజీల ప్రైవేటికరణ చేశారని ఆరోపించారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య అందదని పేర్కొన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళన మరింత ఉధృతం చేస్తా మని ఆయన హెచ్చరించారు. కోటి సంతకాల సేకరణ అన్ని వర్గాల వారు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, వైసీపీ నాయకులు డి.నారాయణమూర్తి, జోగా కొండబాబు, కె.జనార్ధనరావు, పలు పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద మార్గంలో నడవాలి

» జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో కలెక్టర్ విజయకృష్ణన్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

కొత్తూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నేటి యువత స్వామి వివేకానంద సందేశమార్గంలో నడవాలని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. సోమవారం కొత్తూరు పంచాయతీ పరిధిలోని ఏఎంఏఎల్ కళాశాలలో జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఉత్సవాలను ప్రారంభించారు. యువజనోత్సవాల్లో భాగంగా నిర్వహించిన జానపద నృత్యం, గీతాలు, కథా రచనలు, పెయింటింగ్, కవిత్వం, ఆవిష్కరణ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యనిర్వాహక అధికారి కె.కవిత, డీఈవో జి.అప్పారావునాయుడు, ఇంటర్‌బోర్డు అధికారి వినోద్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయబాబు, కరస్పాండెంట్ వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడుల సదస్సుకు పక్కాగా ఏర్పాట్లు

» రేపు సాయంత్రంకల్లా పూర్తికావాలి

» రాత్రికి నగరానికి చేరుకోనున్న సీఎం చంద్రబాబు

» కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో 14, 15 తేదీల్లో జరగనున్న భాగస్వామ్య సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లు ఈనెల 12వ తేదీ సాయంత్రానికి పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. ఎక్కడా ఎటువంటి సమన్వయ లోపం లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సదస్సుకు రెండు రోజులు ముందుగా అంటే...ఈనెల 12వ తేదీ రాత్రికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నగరానికి చేరుకుంటారన్నారు. ఆ మరుసటిరోజు 13వ తేదీన సీఐఐ ప్రతినిధులు, రాష్ట్ర అధికారులతో సీఎం ప్రత్యేకంగా భేటీయి ప్రాథమిక స్థాయి సమావేశాలు నిర్వహిస్తారని, సాయంత్రం అతిథులతో కలిసి గాలా డిన్నర్‌లో పాల్గొంటారన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు పటిష్టమైన ఏర్పాట్లుచేయాలన్నారు. సదస్సులో భారత ఉపరాష్ట్రపతి, గవర్నర్, ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు భాగస్వాములు కానున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. సాధ్యమైనంత వరకు డెలిగేట్లకు కిట్లు రిజిస్ట్రేషన్ సమయంలోనే అందజేయాలన్నారు. స్పాట్ రిజిస్ట్రేషన్లు ఉండవని స్పష్టంచేశారు. శంకుస్థాపనలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లుచేసుకోవాలన్నారు. వీఐపీ, వీవీఐపీల ప్రవేశం, నిష్క్రమణ ద్వారాలు ఏర్పాటుచేయాలన్నారు. నిరంతరం విద్యుత్, ఇంటర్‌నెట్ సదుపాయం కల్పించాలని చెప్పారు. దేశ, విదేశాల నుంచి వచ్చే అతిథులకు సంప్రదాయ, సాంస్కృతిక నృత్యాలతో ఆత్మీక స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని విభాగాల అధికారులు 12వ తేదీ సాయంత్రానికి ఏర్పాట్లు పూర్తిచేసి, ట్రయల్ రన్ నిర్వహించాలని సూచించారు. కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్, పోలీస్ అధికారులు భద్రతాపరమైన చర్యల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. అతిథులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని విషయాల్లో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమీక్షలో రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టీ, జేసీ మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, డీసీపీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పలువురు సీఐలకు స్థానచలనం

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రేంజ్‌లో పలువురు సీఐలకు బదిలీలు/పోస్టింగ్స్ ఇస్తూ డీఐజీ గోపినాథ్ జట్టీ ఉత్తర్వులు జారీచేశారు. విజయనగరం జిల్లా డీసీఆర్‌బీలో ఉన్న బొడ్డేపల్లి సుధాకర్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి సర్కిల్‌కు బదిలీచేసి, అతని స్థానంలో విశాఖ రేంజ్‌లోని కె.కుమార్‌స్వామిని నియమించారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న బి.నారీమణికి శ్రీకాకుళం మహిళా పోలీస్ సర్కిల్‌లో పోస్టింగ్ ఇచ్చి, అక్కడ పనిచేస్తున్న వానపల్లి రామారావును శ్రీకాకుళం ట్రాఫిక్ సర్కిల్‌కు బదిలీచేశారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న ఎస్.లక్ష్మణరావుకు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎన్‌డీపీఎస్ టాస్క్‌ఫోర్స్ సీఐగా పోస్టింగ్ ఇచ్చి, అక్కడి సీఐ సువ్వారి రామును రేంజ్ వీఆర్‌కు, అచ్యుతాపురం యూపీఎస్ సీఐ నమ్మి గణేష్‌ను రేంజ్‌కు అటాచ్ చేశారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న కంది నీలిమను అనకాపల్లి జిల్లా మహిళా పోలీస్ సర్కిల్‌లో నియమించి, అక్కడ పనిచేస్తున్న ఆర్వీఎస్ఎస్ చంద్రశేఖరరావును అచ్యుతాపురం యూపీఎస్‌కు బదిలీ చేశారు.

క్షేత్రస్థాయిలో పర్యటించి అర్జీలను పరిష్కరించాలి


అర్జీని పరిశీలిస్తున్న జేసీ జాహ్నవి


అర్జీదారుల సమస్యను ఆలకిస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

» జాయింట్ కలెక్టర్ జాహ్నవి

» పీజీఆర్ఎస్‌లో 239 వినతులు

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పౌరులు చేసుకున్న అర్జీలపై క్షేత్రస్థాయిలో పర్యటన చేసి ఆయా సమస్యలను త్వరగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ జాహ్నవి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆమెతోపాటు హౌసింగ్ పీడీ శ్రీనివాస్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జాహ్నవి మాట్లాడుతూ, ప్రజలు అందజేసిన అర్జీలకు సంబంధించిన సమస్యలను నిర్దిత గడువులోగా పరిష్కరించాలని, ఈ విషయంలో అర్జీదారులతో నేరుగా మాట్లాడాలని సూచించారు. పౌరులు తమ సమస్య పరిష్కారానికి పదేపదే కలెక్టరేట్‌కు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత కిందిస్థాయి అధికారులపైనే వుందన్నారు. పీజీఆర్ఎస్‌లో మొత్తం 239 అర్జీలు అందాయి. పరిష్కార నిమిత్తం ఆయా శాఖకు బదలాయించారు. ఈ కార్యక్రమంలో సీపీవో జి.రామారావు, జిల్లా ఎక్సైజ్ అధికారి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో...

అనకాపల్లి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీలపై వారం రోజుల్లో విచారణ పూర్తిచేసి పరిష్కారం చూపాలని ఎస్పీ తుహిన్‌సిన్హా పోలీసులు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన పలువురి నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. వీటికి సకాలంలో పరిష్కారం చూపుతామన్నారు.

పునరావాస కాలనీలో సకల సదుపాయాలు

» కలెక్టర్ విజయకృష్ణన్


కారిడార్ నిర్వాసితులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

నక్కపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లోని నక్కపల్లి క్లస్టర్ నిర్వాసితుల కోసం బోదిగల్లం సమీపాన నిర్మిస్తున్న పునరావాస కాలనీలో అన్ని సదుపాయాలు కల్పిస్తామని కలెక్టర్ విజయకృష్ణన్ చెప్పారు. సోమవారం మధ్యాహ్నం ఆమె ఇక్కడకు వచ్చి పునరావాస కాలనీలో నిర్మాణ పనులను పరిశీలించారు. పాటిమీద, మూలపర్ర గ్రామాలకు చెందిన కొందరు నిర్వాసితులు ఇళ్ల నిర్మాణాలకు సోమవారం భూమి పూజ చేశారు. కలెక్టర్ కూడా వారితోపాటు భూమి పూజలో పాల్గొన్నారు. అనంతరం నిర్వాసితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించగా, ప్రభుత్వం ఇచ్చేసాయం చాలదని పలువురు నిర్వాసితులు చెప్పారు. కలెక్టర్ వెంట ఆర్డీవో వీవీ రమణ, తహశీల్దారు నరసింహమూర్తి, కూటమి నేతలు కురందాసు నూకరాజు, గింజాల లక్ష్మణరావు, అమలాపురం సర్పంచ్ పెదపూడి శంకరరావు తదితరులు వున్నారు.

విశాఖకు ఐటీ పరిశ్రమల వెల్లువ

... 5వ పేజీ తరువాయి

విస్తరించడానికి అనుమతులు ఇస్తున్నట్టు ప్రకటించారు.

- రహేజా కార్పొరేట్ రియల్ ఎస్టేట్ సంస్థకు రుషికొండ ఐటీ హిల్ నంబర్ 3పై 27.1 ఎకరాల భూమిని కేటాయించారు. ఎకరా భూమి కేవలం 99 పైసలకే ఇచ్చారు. అందులో ఐటీ, ఐటీ సేవలకు సంబంధించిన ఆఫీసులతో పాటు రెసిడెన్షియల్‌కు అనువుగా నిర్మాణాలు చేపడుతుంది. వాస్తవంగా 9,681 మందికి ఉద్యోగాలు ఇవ్వాలని ఒప్పందం కాగా, భూమి ప్రోత్సాహం కింద 15 వేల మందికి ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చింది.

- ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్‌కు విశాఖలో 10.29 ఎకరాలు కేటాయించారు. దాని లీజును 33 ఏళ్ల నుంచి 99 ఏళ్లకు పెంచారు. అందులో జీసీసీ (గ్లోబల్ కేపబులిటీ సెంటర్) అభివృద్ధి చేయనుంది.

- క్వార్క్స్ టెక్నో సాఫ్ట్ అనే సంస్థ ఐటీ క్యాంపస్ ఏర్పాటుకు ముందుకు రాగా వారికి నాలుగు ఎకరాలు కేటాయించారు. రాయితీ ధరతో ఇచ్చారు. క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ తదితర రంగాలలో రెండు వేల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయి.

- విశాఖకు చెందిన ఫ్లూయెంట్ గ్రిడ్ సంస్థకు కాపులుప్పాడ సర్వే నంబరు 401లో 3.3 ఎకరాల భూమి కేటాయించారు. అక్కడ ఎకరా రూ.30 కోట్లు కాగా వారికి ఎకరా రూ.2 కోట్లు చొప్పున ఇచ్చారు. అందులో రూ.150 కోట్లు పెట్టుబడి పెట్టి రెండు వేల మందికి ఉద్యోగాలు ఇస్తామని ఒప్పందం చేసింది. అందులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, అడ్వాన్స్‌డ్ ఐటీ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు.

- మదర్‌సన్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్‌కు కాపులుప్పాడ ఐటీ పార్కులో 3.55 ఎకరాలు ఎకరా కేవలం 99 పైసలకే కేటాయించారు. అందులో ఐటీ ఆర్ అండ్ డి సెంటర్, జీసీసీ ఏర్పాటు చేస్తారు. రూ.109.73 కోట్ల పెట్టుబడితో 700 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.

- ఐస్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థకు రుషికొండ ఐటీ పార్కు హిల్ నంబర్2పై రెండు ఎకరాల భూమి కేటాయించారు. అందులో 4.59 లక్షల చ.అ. విస్తీర్ణంలో ఐటీ క్యాంపస్ అభివృద్ధి చేస్తుంది. దానికి రూ.119.18 కోట్లు పెట్టుబడి పెడుతుంది. అందులో రెండు వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఎకరా రూ.4 కోట్లకే కేటాయించడం గమనార్హం.

- అనకాపల్లిలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సంస్థకు 160 ఎకరాలు కేటాయించారు. అందులో రూ.489 కోట్లతో నీటి అడుగున ఆయుధాలు, రక్షణ పరికరాలు తయారుచేసే వ్యవస్థను రూపొందిస్తుంది. అందులో 500 మందికి ఉద్యోగాలు వస్తాయి.

- అనకాపల్లి జిల్లాలో డోస్కో ఇండియా సంస్థకు 150 ఎకరాలు కేటాయించారు. అందులో రూ.1,234 కోట్ల పెట్టుబడితో 1,454 మందికి ఉపాధి కల్పిస్తుంది.

- విశాఖపట్నానికి చెందిన విశ్వనాథ స్పోర్ట్స్ అండ్ కన్వెన్షన్స్ సంస్థకు భవానీద్వీపంలో అడ్వెంచర్ థ్రిల్ సిటీ ఏర్పాటుకు భూమి కేటాయించారు. ఈ సంస్థ విశాఖ నుంచి విజయవాడకు తన కార్యకలాపాలు విస్తరించనుంది.

- విశాఖపట్నంలో జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ బెంచ్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. అందులో నిజాయితీగా పనిచేసే అధికారులు, సిబ్బందిని నియమించాలని సూచించారు.

- విశాఖపట్నంలో రియల్‌టైమ్ గవర్నెన్స్, డిజిటల్ పరిపాలన తదితరాల కోసం సింగపూర్ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు.

యూరియా కోసం తోపులాట

... 5వ పేజీ తరువాయి

ఉదయం ఏడు గంటలకే పలువురు రైతులు వచ్చారు. మొత్తం 220 బస్తాల యూరియా మాత్రమే రాగా, రైతులు రెట్టింపు సంఖ్యలో వున్నారు. దీంతో తోపులాట జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి రైతులను క్యూ లైన్లలో నిల్చోబెట్టారు. ఒక్కో రైతుకు ఒక బస్తా చొప్పున 130 మందికి యూరియా అందజేశారు. మిగిలిన రైతులకు టోకెన్లు ఇచ్చి, మంగళవారం రావాలని చెప్పారు.

పరిశ్రమల హబ్‌గా మాకవరపాలెం

... 5వ పేజీ తరువాయి

మంగళవారం సీఎం చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఇక్కడ జరిగే కార్యక్రమంలో అయ్యన్నపాత్రుడు పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించనున్నారు. సుమారు రెండు దశాబ్దాల క్రితం అల్యూమినియం కంపెనీ కోసం ప్రభుత్వం భూమిని సేకరించింది. కంపెనీకి కేటాయించగా 290 ఎకరాలు మిగిలింది. ఇది అప్పటి నుంచి ఏపీఐఐసీ ఆధీనంలో వుంది. దీంతోపాటు 737 సర్వే నంబరులో ఉన్న ప్రభుత్వ భూమిలో మరో 20 ఎకరాలతో కలిపి మొత్తం 310 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు కానున్నట్టు తహశీల్దార్ వెంకటరమణ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింహారావు తెలిపారు. కాగా మండలంలో ప్రైవేటు రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నది. రాచపల్లి సర్వే నంబరు 737లో చిన్న, సన్నకారు రైతుల సాగులో ఉన్న కొండపోరంబోకు భూమి 406 ఎకరాలు వున్నట్టు గుర్తించారు. ఇందులో 150 ఎకరాలను ఎక్స్‌కవేటర్లు, బుల్‌డోజర్లు వంటి వాటికి విడిభాగాలను తయారు చేసే 'డోస్కో ఇండియా ప్రైవేటు లిమిటెడ్' కంపెనీకి, మరో 150 ఎకరాలను ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీకి కేటాయించినట్టు ఆధికారులు చెబుతున్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే పెట్టుబడుల సదస్సులో వీటికి సంబంధించిన ఎంఓయూలు చేసుకుంటారని తెలిసింది.

అడుగడుగునా గోతులే!

... 5వ పేజీ తరువాయి

జన్నవరం వరకు తారురోడ్డు వేశారు. అయితే ప్రభుత్వం నిధులను వేరే వాటికి మళ్లించడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. జన్నవరం నుంచి చోడవరం వరకు పనులు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు చొరవ తీసుకుని, ఉపాధి నిధులు రూ.2 కోట్లతో చోడవరంలోని కొత్తూరు జంక్షన్ నుంచి అర కిలో మీటరు మేర రోడ్డు వేయించారు. ఇది మినహా జన్నవరం వంతెన వరకు రహదారి దుర్భరంగా తయారైంది. పీఎస్‌పేట, బంగారమ్మపాలెం, బెన్నవోలు, జన్నవరం, తిమ్మనపాలెం, కన్నంపాలెం, చాకిపల్లి, రామజోగిపాలెం గ్రామాలతోపాటు ఏటవతల బుచ్చెయ్యపేట మండలానికి చెందిన అనేక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి ఛిద్రం కావడంతో ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రూట్లో తిరిగే ఆటోలు, ఇతర వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ప్రభుత్వం స్పందించి పీఎస్‌పేట-జన్నవరం రోడ్డును బాగుచేయించాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

జనవరి 3, 4 తేదీల్లో అరకు చలి ఉత్సవాలు

పాడేరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అరకులోయ చలి ఉత్సవాలు జనవరి 3, 4 తేదీల్లో నిర్వహించే అవకాశం ఉందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం అరకు చలి ఉత్సవాలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చలి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అధికారులు కృషిచేయాలన్నారు. తొలిరోజు (జనవరి 3న) సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రలేఖనం పోటీలు ఉంటాయన్నారు. రెండో రోజు (4న) సైక్లింగ్, లేజర్ షో, ఫ్లవర్ షో, గిరిజన సంప్రదాయ ప్రదర్శనలు, దేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే గిరిజన కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

క్రైం... crime news

కొట్లాటలో గాయపడిన యువకుడి మృతి

» నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు


మీడియా సమావేశంలో సీఐ ధనుంజయరావు. వెనుక ముఖాలకు ముసుగులతో నిందితులు


నెట్టి శివ (ఫైల్ ఫొటో)

ఎలమంచిలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎలమంచిలిలో జరిగిన పంచరాత్రుల తీర్థ మహోత్సవంలో కొంతమంది యువకుల మధ్య జరిగిన కొట్లాటలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. సీఐ ధనుంజయరావు సోమవారం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించిన వివరాలిలా వున్నాయి.

ఎలమంచిలి టిడ్కో కాలనీలో నివాసం ఉంటున్న నెట్టి శివ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత నెల 25వ తేదీన పంచరాత్రుల తీర్థ మహోత్సవానికి స్నేహితులతో కలిసి వెళ్లాడు. రాత్రి సుమారు 10 గంటల సమయంలో సినిమా హాలు జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న యువకులకు, శివ భుజం తగిలింది. దీంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. నలుగురు యువకులు దాడి చేయడంతో శివ తలకు తీవ్ర గాయమైంది. స్నేహితులు స్థానిక సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా వుండడంతోఅక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు పంపారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న శివ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి మృతిచెందాడు. తండ్రి కారు డ్రైవర్‌గా పనిచేస్తూ సుమారు నాలుగేళ్ల క్రితం మృతిచెందడంతో అప్పటి నుంచి కుటుంబ భారం ఇతనిపై పడింది. కాగా నెట్టి శివ మృతి కేసుకు సంబంధించి పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. ఎలమంచిలి ధర్మవరం ప్రాంతానికి చెందిన కశింకోట గువ్వాలు, వెదుళ్ల మోహన్, గొన్నాబత్తుల విఘ్నేశ్, కొరారు రవితేజలను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

సైబర్ నేరంపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరంపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ జి.ప్రేమ్‌కుమార్ తెలిపారు. తుమ్మపాలకు చెందిన మడికి శివకుమార్ వాట్సాప్‌కు గత ఏడాది నవంబరు 18వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి ఒక లింక్ పంపాడు. ఒక వ్యక్తి ఫోన్ చేసి.. మీకు నచ్చిన ఏదో ఒక వస్తువును ఈ గ్రూపులో పెట్టి దానిపై పెట్టుబడి పెడితే డబ్బులు వస్తాయని చెప్పాడు. దీంతో శివకుమార్ గత ఏడాది నవంబరు 18వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి మూడో తేదీ వరకు దఫదఫాలుగా రూ.2,53,400 పెట్టుబడి పెట్టాడు. అయితే ఎటువంటి లాభాలు రాకపోవడంతో మోసపోయాయని గుర్తించి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు.

ఏటికొప్పాక జాతరలో అర్చకునిపై దాడి

ఎలమంచిలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ ఏటికొప్పాకలో ఆదివారం రాత్రి జరిగిన బండిమాంబ అమ్మవారి జాతరలో ఓంకారేశ్వర స్వామి ఆలయ అర్చకుడు ఆచంట సుబ్రహ్మణ్యశర్మపై యువకులు దాడి చేసి గాయపరిచారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న పోలీసులు ఆయనను సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. కాగా అర్చకునిపై దాడి చేసిన వారిపై ఆలయ నిర్వాహకులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. దీనిపై సీఐ ధనుంజయరావును వివరణ కోరగా.. తమకు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని చెప్పారు.

149 మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

రావికమతం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో గొంప గ్రామంలో పాన్‌షాపులో మద్యం అమ్ముతున్న యజమాని కొప్పాక నాగేశ్వరరావును అరెస్ట్ చేసి 149 మద్యం సీసాలను స్వాధీనం రావికమతం ఎస్ఐ ఎం.రఘువర్మ తెలిపారు. స్పెషల్ బ్రాంచ్ సీఐ బాల సూర్యారావుకు ముందస్తుగా అందిన సమాచారం మేరకు రావికమతం పోలీసులు, ఎస్‌బీ సిబ్బంది కలిసి సోమవారం గొంపలో కొప్పాక నాగేశ్వరరావు పాన్‌షాపులో తనిఖీ చేశామన్నారు. ఈ సందర్భంగా 149 మద్యం సీసాలను పాన్‌షాపులో స్వాధీనం చేసుకున్నామన్నారు. మద్యం విక్రయిస్తున్న నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు. ఆయన తట్టబంద, సీతయ్యపేట వైన్‌షాపుల నుంచి మద్యం తీసుకొచ్చి పాన్‌షాపులో విక్రయిస్తున్నారన్నారు.

బాలికను మోసం చేసిన యువకుడిపై పోక్సో కేసు

నర్సీపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాలికను నమ్మించి మోసం చేసిన యువకుడుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ గోవిందరావు తెలిపారు. మునిసిపాలిటీలో గంగాధర్ థియేటర్ ఏరియాలో నివాసం ఉంటున్న ఆవుపాటి చరణ్‌తేజ (23) ఒక బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశాడు. బాల్య వివాహ నిరోధక చట్టం, పోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద ఆదివారం కేసులు నమోదు చేశామని తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589